గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# అక్టోబర్2017 కథలు




ఏంట్రా పొద్దున్నే మీ అమ్మని సతాయిత్తన్నావు .కళ్ళు నులుముకుంటూ లేచాడు సూరయ్య.

ఆ మాటలకి,అతని భార్య లచ్చవ్వ , ఏం లేదయ్యా. ఈయాల ఆడి కాలేజి పిల్లగాల్లంతా కలిసి పిక్నిక్కికీ పోతన్నారంట. కూడా ఆడపిల్లలు కూడా వత్తారంట.పాత చొక్కాలు ఏసుకెళ్ళేది ఎట్టా అంటన్నాడు.అన్నిట్లోకి బావున్న ఓ చొక్కాకి జేబు కాడ కన్నం ఉంది.ఎలకలు తిరుగుతున్నై కదా ఇంట్లో.ఈ సిరుగు కనబడకుండా కుట్టమని పేణం తీత్తనాడు.చెప్పిందామె ,తన చేతిలోని చొక్కాకున్న చిరుగుని సూరయ్యకి చూపుతూ.

ఆ,ఆ ,అర్ధమైనాది.ఆవ్ అంటూ ఓ క్షణం ఆవలించి,పైకి లేస్తూ,ఆ సొక్కా ఏసుకు పోవాలంటే కట్టవే.అది మీ అమ్మోటి కుడతాది కానీ,తానం సేసిరా.ఇద్దరం అంగడికి పోదాం.ఆడ, ఆ రావుడి గాడి కొట్లో కొత్త సొక్కా కొంటాలే .కానీ ఒరే అయ్యా,మళ్ళీ సంవచ్చరం వరకూ కొత్త సొక్కా అడగమాక .చెప్పాడు సూరయ్య,తను పడుకున్న చాపని చుట్టేసి ఓ మూలగా పెట్టేస్తూ.

తండ్రి మాట వింటూనే చంద్రం కళ్ళు మెరిసాయి.కొత్త చొక్కా.అబ్బా.భలే.కొత్త చొక్కా కొనుక్కుని రమా రమి మూడేళ్లు కావస్తోంది.ఎప్పుడూ ఆ వేసిన చొక్కాలే.వేసి వేసి విసుగు వచ్చేసింది.అవునూ ఇంతకీ ఏ రంగు చొక్కా కొనుక్కోవాలి.అని ఆలోచిస్తున్నవాడల్లా ,అమ్మో, నాన్నా అంగడికెళ్దామన్నాడుగా .ఆలస్యం అయిపోతుంది అనుకుంటూ,త్వర త్వరగా స్నానం చేసి

తయారయిపోయాడు.తర్వాత తండ్రితో కలిసి,ఆ పల్లెటూళ్లోనే పెద్ద అంగడికి బయల్దేరాడు.దారిలో రోడ్డు పక్కగా ఆపి ఉన్న కొత్త ఆటోని చూస్తూ,ఒరే అయ్యా,ఇట్టాంటి ఆటో కొనుక్కోవాలనుందిరా.ఇంకా ఎంతకాలం ఆ బస్సు కాంప్లెక్సుల్లో పేలాల పేకెట్లు అమ్ముతాను.రోజు రోజుకీ కొనేవోడే కరువైపోతుంటేను.అంటూ ఆ ఆటోని ప్రేమగా తాకాడు సూరయ్య.

ఏంటి నాన్నా నువ్వు.ఆ ఆటో కి ఉన్న మురికి నీ చేతికి అంటగలదు.ముట్టుకోకు.చెప్పాడు చంద్రం.తర్వాత ఇద్దరూ,అంగడిలో రాములు బట్టల దుకాణం అన్న బోర్డు ఉన్న కొట్టు దగ్గర ఆగారు.ఇద్దరూ దుకాణంలోకి వెళ్లారు.

ఏం కావాలి.అడిగాడు రాములు,వారి వంక కొంచెం చిరాగ్గా చూస్తూ.

మా అబ్బాయికి ఓ కొత్త సొక్కా కావాలి.కొంచెం తక్కువలో.అంటే నూటాబై అలా.కానీ పేషనుగా ఉండాలి.మావోడు పట్నం గవర్మెంట్ కాలేజిలో ఇంటెర్మీడేట్ సదువుతున్నాడు మరి.చెప్పాడు చిన్న నవ్వుతో పిల్లాడిలా మురిసిపోతూ.

సరే,సరే .అని సైజు కనుక్కుని కొన్ని చొక్కాలు బయటకు తీసాడు.వాటిలో పసుపు రంగుపై నల్ల గీతల చొక్కా చాలా నచ్చింది చంద్రానికి.నాన్నా ఈ చొక్కా చాలా బావుంది చెప్పాడు సంతోషంగా.

అట్టనా .అయితే అదే తీసుకోయ్యా.ఆ సొక్కా ఎంత రాములూ.?

అదయితే మరో ముప్పై ఎక్కువవుద్ది.అంటే మొత్తం నూటఎనబై రూపాయిలు.చెప్పాడు.

సరే రాములు, అట్టనే.కానీ పేలాల పొట్లాలు అమ్మేసాక, సాయంకాలం తెచ్చి ఇచ్చేత్తాను.ఇప్పుడు నాకాడ నూటాబై మాత్రమే ఉంది.కొంచెం సూడు.ఎందుకంటే మా వోడు ఆడి స్నేయితుల్తో కలిసి పిక్కినికికి ఎల్తన్నాడు.చెప్పాడు సూరయ్య చిన్న చిరునవ్వుతో బ్రతిమాలుతున్నట్టుగా.

పో,పోరా చావు గిరాకీ.పొద్దునే ఎదవ నాంచుడు బేరాలు.ఇదే పట్నంలో అయితే ఎయ్యి రూపాయిలు.కాపోతే అందంగా అద్దాల గదుల్లోనూ,చల్ల గదుల్లోనూ పెట్టి అమ్ముతార్రా సూరిగా.పో పోరా.అని విసుగుతుండగానే,నాన్నా నాకు ఈ చొక్కా వద్దు.దీనికి రెండు బొత్తాలు లేవు.పైగా కాలర్ దగ్గర కూడా కొంచెం మాసింది.అంటూ ఆ చొక్కాని తండ్రికి చూపాడు చంద్రం.

సుసావా రాములు.సొక్కాలో ఎన్ని లోపాలున్నాయో .వాడేసిన బట్టలు గానీ మాకు అమ్మాలని సూత్తనావ.మాకు నీ సొక్కా వద్దూ.నీ కొట్టూ వద్దూ.రారా అయ్యా. మనం వేరే దుకాణానికి పోదాం.అంటూ లేవబోయాడు సూరయ్య.

ఏంట్రా సూరిగా.అలా లేచెల్లిపోబోతున్నావ్.పాత స్టాకు కదా.చిన్న లోపాలుంటాయి.కోప్పడకురా .సరే ముప్పై రూపాయిలకేటుంది కానీ ,నువ్వడిగిన ఆ నూటెబైకే తీసుకెళ్లు.గుండీలేగా.ఏవోటి కుట్టుకుంటే చొక్కా బంగారంలా ఉంటాది.చెప్పాడు రాములు,కాస్త దిగువ స్వరంతో బ్రతిమాలుతున్నట్టు.

ఆ మాటలకి సూరయ్య,సరే అట్టనే కానీ.ఏరా అయ్యా నీకు సరేనా మరి అడిగాడు చంద్రాన్ని.

సరే నాన్నా.చెప్పాడు చంద్రం ముక్త సరిగా.ఆ చొక్కా తీసుకుని,ఇద్దరూ దుకాణం లోనుండి బయటికి వచ్చారు.ఏరా అయ్యా .ఆ చొక్కాకి సరిపడా రంగు బొత్తాలు మనింట్లో ఏడున్నాయి.మన టేలరు అప్పలరాజు కాడికి పోదామా ,సక్కగా కుట్టిపెడతాడు.అడిగాడు.

ఎందుకూ నా దగ్గర అచ్చం అలాంటి గుండీలు ఉన్నాయిలే చెప్పాడు చంద్రం.

అట్టనా. నీ కాడ అలాంటి గుండీలు ఎలా.అడిగాడు ఆశ్చర్యంగా.


ఎలా అంటే ఇలా అంటూ రెండు బొత్తాలని తీసి తండ్రికి చూపాడు చంద్రం.

ఇంకా ఆశ్చర్యపోతూ, అరె, అదే రంగు అదే రకం బొత్తాలు నీకెట్టా వచ్చాయి.

ఎలా అంటే ఇందాక ఆ రాములు నిన్ను ముప్పై రూపాయిల గురించి అన్ని మాటలనేసరికి నాకు బాగా బాధనిపించింది.ఈ చొక్కా వద్దని చెప్పాలనిపించింది.కానీ మామూలుగా వద్దంటే,కొనే స్తోమత లేనపుడు ఎందుకు రావడం లాంటి సూటి,పోటు మాటలు అంటాడనిపించి,రెండు బొత్తాలు తీసేసి,ఈ బొత్తాల్లేని చొక్కా మాకు వద్దనే వంకతో,మన ఆత్మాభిమానం దెబ్బతినకుండా మనం బయటపడొచ్చని అలా చేశా నాన్నా.కానీ వాడు తగ్గించి మనకే ఇస్తాడనుకోలేదు.చెప్పాడు చంద్రం,తండ్రి వంక కాస్త బెరుకుగా చూస్తూ.

ఆ మాటలు విన్న సూరయ్య ,నువ్వు కూడా నాలనే ఆలోసించావ్.అంటూ చిన్నగా నవ్వేసి, ఆ కాలరు మాపింది నేనే.ఇందాక ఆటో ముట్టినప్పుడు చేతికైనా దుమ్ముని కొంచెం చొక్కాకి రాసి,మురికిగా ఉంది మాకొద్దు అనే వంకతో బయటపడొచ్చని నేనూ అలా సేశా.కానీ యాపారం సేసేవోడు లాభం సూసుకుంటాడుగా.సాయంత్రం ఆడికి ఎదోటి సెప్పి ఆ ముప్పై ఇచ్చేస్తారా అయ్యా.దీనిని బట్టి నువ్వు అర్థం సేసుకోవాల్సింది ఏటంటే మనం సేతనైతే ఒకరికి సాయపడాల లేదా మానేయాల .అంతే కానీ , ఏ వ్యక్తి ఆత్మాభి మానాన్ని

దెబ్బతీసేలా, కించపరిచేలాగా మాట్లాడకూడదు.మనలాగే ఎంతో బాధపడతారు .సూరయ్య చెప్తూ నడక ప్రారంభించగానే ,చంద్రం అనుసరించాడు.




మధనపురి రాజ్యానికి రాజు రాజశేఖరుడు. ఆయన పరిపాలనలో ప్రజలు తిండి బట్టకు కొరత లేకుండా కష్టాలకు అతీతంగా ఎంతో సుభీక్షంగా బ్రతికేందుకు మంత్రి నందనుడి సలహాలతో జాగ్రతలు తీసుకొని తెలివిగా పరిపాలనను సాగిస్తున్నాడు. ప్రజలు కూడా రాజశేఖరుడి పరిపాలనలో సుఖ సంతోషాలతో జీవనాన్ని గడుపుతుండగా పొరుగు రాజ్యాలు సైతం రాజును పొగడ్తలతో అభినందించసాగాయి. అయితే రాజు భార్య వసుంధరదేవి, కొడుకు చంద్రశేఖరుడు పరిపాలనలో ఒక్కింత కూడా జోక్యం కల్పిచుకొనేవారుకాదు. అందుకే మంత్రి నందనుడు అలా రాజ్య పరిపాలనను పట్టించుకోని రాజుగారి భార్యను,అయన కొడుకుని కూడా ఎలాగైనా పరిపాలనలో పాలుపంచుకునేలా చేయాలని అప్పుడే వాళ్ళకూ ప్రజల యోగ క్షేమాలు, కష్టసుఖాలు తెలుస్తాయని భావించి రాజుకు విషయాన్ని విన్నవించుకొన్నాడు.కాని అదేమంత ముఖ్యం కాదన్నట్టుగా మౌనం

వహించాడు రాజు.

అయితే పరాయి దేశాల కళ్ళు వాళ్ళ దేశంపై పడకుండా చూసుకోవడం, రాజ్యాభివృద్ధికి పాటు పడడం తన కర్తవ్యంగా భావించిన మంత్రి రాజు ఆనతితో సైన్యాన్ని,అశ్వ, గజ బలాలను పటిష్ఠం చేసే పనిలో పడ్డాడు.రాజ్యంలో వున్న యువకులను సంఘటితం పరచి వాళ్ళను సైన్యంలో చేర్పించి శిక్షణను యివ్వాలన్న నిర్ణయం తీసుకొన్నాడు. తన కొడుకుతో పాటు ప్రతి ఇంటికి ఒకరి చొప్పున సైన్యంలో చేర్పించాడు. అందరికి కావలసిన శిక్షణను యిప్పిస్తున్నాడు. అయితే ఆలా శిక్షణ పొందుతున్న వారిలో రాజు కొడుకు చంద్రశేఖరుడు లేకపోవడం అందరిని విస్మయానికి గురి చేసింది.అది గ్రహించిన మంత్రి రాజు కొడుకుని కూడా సైన్యంలో చేర్చాలన్న వుద్దేశ్యంతో రాజును సంప్రదించాడు.కాని ' అది కుదరని పనని,తన కొడుక్కి అలాంటి విద్యలను నేర్పుటకు భార్య వసుంధరదేవికి ససేమిరా యిష్టం లేదని చెప్పి'వాటికి దూరంగా వుంచాడు రాజు.ఇక చేసేది లేక వూరకుండి పోయాడు మంత్రి.

రోజులు దొర్లి పోతున్నాయ్ . మంత్రి కొడుకు సకల విద్యలను చక్కగా నేర్చుకొంటున్నాడు. కాని అవేమీ పట్టించుకోని రాజు కొడుకు అంతకంత దిగజారిపోయి విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. అందుకు పూర్తి బాధ్యత తన తల్లి తండ్రులదేనని ప్రజలు అనుకో సాగారు.

అనతి కాలంలోనే సకల విద్యలలో ప్రావీణ్యత పొందిన మంత్రి కొడుకు తన తండ్రి ఆనతిపై రాజ్యానికి కవచంగానూ, రాజ కుటుంబానికి రక్షగానూ వుంటూ చిన్న చిన్న సమస్యలను తనే పరిష్కరిస్తూ వస్తున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాన్ని రాజ కుటుంబాన్ని కాపాడుతూ వున్నారు మంత్రి ,మంత్రి తనయుడు.


ఇలా వుండగా ఆ దేశంలో వున్న అమితమైన సంపద ,ప్రకృతి సిద్దమైన వనరులమీద పొరుగు రాజ్యపు రాజు పురుషోత్తముడి కన్ను పడింది.మధనపురి సంపదను ,వనరులను దోచుకోవాలన్న ఆశతో యుద్ధాన్ని ప్రకటించాడు పురుషోత్తముడు.ఆ వార్తను తెలుసుకొన్నరాజు యుద్ధానికి భయపడి మంత్రి సలహాతో రాజీ సందేశాన్ని పంపాడు పురుషోత్తముడికి.అయితే అసలే కరవుతో వున్న ఆ పొరుగు రాజ్యాధిపతి పురుషోత్తముడు తను రాజీకి రావాలంటే రాజ్యంలో కొంత భాగాన్ని,కొంత ఐశ్వర్యాన్ని ,ప్రకృతి వనరులను తనకు అప్పజెప్పాలని లేకుంటే యుద్ధం తప్పదని మరు సందేశాన్ని పంపాడు.

అందుకు భయపడ్డ రాజ శేఖరుడు వెంటనే అత్యవసర సభను సమావేశ పరచాడు. మంత్రి, సేనాధిపతులు,రహస్య గుఢాచారులు, తదితర ముఖ్యులతో సంప్రదింపులు జరిపాడు. ఓ నిర్ణయానికొచ్చి మూడు నెలల తరువాత తామూ యుద్ధానికి తయారని లేఖ ద్వారా పురుషోత్తముడికి తెలియజేశాడు. ఇక ఏర్పాట్లలో భాగంగా యుద్ధానికి సైనికులతో పాటు శిక్షణ పొందుతున్న ప్రతి పౌరుడూ పాల్గొనాలని ఆజ్ఞ జారీ చేశాడు.రాజాజ్ఞ ప్రకారం వందలకొద్ది వీరులు యుద్ధానికి సంసిద్ధమయ్యారు.కాని అందరూ

రాజుని ఏహ్య బావంతో చూస్తూ వాళ్ళలో వాళ్ళే ఏదో గొణుక్కుంటూ వెళ్ళి పోవడం గమనించాడు రాజు.

మరుసటి రోజు సభలో ఆశీనుడైన రాజు మంత్రిని పిలిచి"మంత్రివర్యా!నిన్న మన రాజ్య ప్రజలందరూ నా వేపు అదోలా చూస్తూ ముభావంగా ఏహ్య బావాన్ని కనుబరుస్తూ వెళ్ళిపోయారు.అందుకుకారణమేమిటి"అని అడిగాడు.అందుకు మంత్రి లేచి రాజుకి దగ్గరగా వెళ్ళి "మహారాజా! ఈ విషయం తమకు కాస్త బాధను కలిగించవచ్చు.అయినా సమయం వచ్చింది కనుక చెబుతున్నాను. మన రాజ్యంలోని ప్రతి ఇంటినుంచి ఓ యువకుడు యుద్ధంలో పాల్గొనాలని ఆజ్ఞను జారీ చేసిన తమరు తమ కుమారుని వాళ్ళతో పాటు యుద్ధానికి సన్నద్ధం చేయలేదన్నదే వాళ్ళ బాధ.'అంటే...అంతఃపుర వాసంతో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించేది యువరాజావారు, యుద్ధాలకు వెళ్ళేది మేమా' అంటూ వాళ్ళలో వాళ్ళే మదన పడసాగారు"అని వివరించాడు. ఆ మాటలు రాజుగారిని ఆలోచింపజేశాయి. అందులో తన స్వార్థం స్పస్పుటమైంది. వెంటనే "అంటే కష్టాలు కన్నీళ్ళు ఒకరికి , సుఖసంతోషాలు మరొకరికన్న గూడార్థం అందులో దాగుందన్నమాట.అర్థమైంది. మంత్రివర్యా! ఇది మన చినరాజావారిని గూర్చిన ప్రస్తావన. మేము రాజ్య ప్రజలను యుద్దానికి పంపి మా కొడుకుని అంతఃపురంలో వుంచుకోవడం తప్పని నాకు చెప్పకనే చెప్పి తెలియజేశారు మన రాజ్య ప్రజలు. ఎటూ యుద్ధానికి మరో మూడు మాసాలు వ్యవధి వుంది కనుక రేపటినుంచే చినరాజావారిని తీసుకువెళ్ళి యుద్ధానికి కావలసిన అన్ని రకాలైన విద్యలను నేర్పి మీ కుమారుడివలే తయారు చేసి తీసుకు వచ్చే బాధ్యత మీకు అప్పగిస్తున్నాను.మహారాణివారితో మేము మాట్లాడుకొంటాము.ఏర్పాట్లు చేయండి"అంటూ వెళ్ళిపోయాడు.

మంత్రి ఆ రెండవ రోజునుంచే చినరాజావారికి సకల విద్యలు నేర్పుటకు గురువుల వద్దకు తీసుకువెళ్ళాడు.




"హర్షా!"

"ఊఁ"

"నిద్రోస్తుందా?"

"ఊఁ"

"ప్లీజ్ హర్షా"

"వద్దు దీపూ! ఇప్పుడస్సలు మూడ్ లేదు, ఓపిక అంతకన్నా లేదు"

"రెండు నిమిషాల్లో అయిపోతుంది హర్షు, ప్లీజ్"

"సరే కానీ", తన మాట ఎలానో నెగ్గదని తెలిసి ఒప్పుకున్నాడు హర్ష.

"మా ఆయన బంగారం", అని మొదలుపెట్టింది దీపిక.

"మరేమో ఎదురింటి సరితకు ఒక ఫ్రెండ్ ఉందిట, వాళ్ళాయన తనని ఎంతో బాగా చూసుకునేవాడంట, ఒకరోజు ఇద్దరు కలిసి సినిమాకి వెళితే అక్కడ ఎవరో ఒకావిడ కనిపించిందిట, ఆవిడని చూసి మొదట షాకయినా వెంటనే తేరుకొని ఆవిడ తన క్లాస్మేటని పరిచయం చేసాడట, ఆ తరువాత నుంచి ఆయనలో వచ్చిన మార్పులు గమనించి ఏమిటి విషయం అని ఆరాతీస్తే ఆ థియేటర్లో కనిపించినావిడ, ఈయన కాలేజీలో ప్రేమించుకున్నారట, అంతకన్నా ఘోరమైన విషయమేంటంటే వాళ్ళిద్దరూ ఇప్పుడు కూడా వాళ్ళ బంధాన్ని కొనసాగిస్తున్నారుట", గుక్క తిప్పుకోకుండా, ఫులుస్టాప్ లు పెట్టకుండా చెప్పాలనుకున్నది చెప్పేసింది.

ఇరుగుపొరుగు వాళ్ళ ఇళ్లలో కబుర్లు, ఎక్కడో ఎప్పుడో చదివిన కథలు, నేరాలు ఘోరాలు వంటి ధారావాహికలు... విని, చదివి, చూసి, అవన్నీ హర్షకి చెప్పడం అలవాటుగా మారిపోయింది దీపికకి. పిల్లలు పుట్టకముందు హర్ష ఆఫీస్ నుంచి రాగానే భోజనం పెట్టి 'కథాగోష్ఠి' మొదలుపెట్టేసేది. ఇప్పుడు భోజనాలు అయ్యాక పిల్లలతో హోంవర్క్ చేయించి, వాళ్ళతో ఆటలాడి, వాళ్ళని పడుకోబెట్టే సరికే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. అందుకే ఇలా హర్షని పడుకోనివ్వకుండా ఇబ్బంది పెట్టవలసి వస్తుంది, లేకపోతే అవన్నీ కడుపులో దాచుకోలేక తను ఇబ్బంది పడవలసి వస్తుంది.

ఆ కథ విన్న హర్ష "దీన్ని బట్టి ఏమర్థమయ్యింది? భర్త తన క్లాస్ మేట్స్ ని పరిచయం చేస్తే వాళ్ళిద్దరిమధ్యా ఏముందని ఆరాలు తీయకూడదు, తీస్తే ఇలానే బాధపడవలసి వస్తుందని. అంతేగా? ", వ్యంగ్యంగా అన్నాడు హర్ష.

"అదేంటి హర్షు అలా అంటావ్"

"లేకపోతే ఏంటి దీపూ! వాళ్ళు ఎవరో కూడా తెలియదు మనకి, మనం ఇలా నిద్రలు ఆపుకొని వాళ్ళ గురించి, అది కూడా నెగటివ్ గా, మాట్లాడుకోవడం అవసరమా?""అదీ కరెక్టే అనుకో..." అని ఏదో చెప్పబోయింది.

"ఇంక పడుకో దీపూ, రేపు పిల్లల్ని జూకి తీసుకువెళ్లాలి, అక్కడ తిరగడానికి ఓపిక కావాలి కదా", అని ఆవులించాడు హర్ష.

ఏ కళనుందో దీపిక కూడా మారు మాట్లాడకుండా పడుకుంది.

మర్నాడు ఉదయం పిల్లలే ముందుగా లేచి దీపిక, హర్షలని నిద్రలేపారు. వాళ్ళ కళ్ళలోని మెరుపే చెబుతుంది జూకి వెళ్తునందుకు వాళ్ళు ఎంత ఆనందంగా ఉన్నారోనని.

అందరూ రెడీ అయ్యి టిఫిన్లు తింటుండగా...

"అమ్మా! చూడమ్మా అన్నయ్య, జూకి నేను వస్తే నన్ను కూడా కోతుల బోనులో వేసేస్తారు అంటున్నాడు", అని బుంగమూతి పెట్టి ఫిర్యాదు చేసింది చిన్నారి.

"ఏంకాదమ్మా! చిన్నారే 'జూలో కొత్త జంతువులకు ప్లేస్ లేదండి' అని నన్ను లోనికి రానివ్వరు అంటుంది", అని చింటూ ఫిర్యాదు.

అన్నాచెల్లెళ్లు ఉన్న ఇళ్లలో ఈ గిల్లికజ్జాలు తప్పవేమో అనుకోని నవ్వుకుంది దీపిక.

"మీరిలాగే గొడవలు పడుతుంటే మిమ్మల్ని ఇంట్లోనే వదిలేసి అమ్మా నేను వెళ్ళిపోతాం జూకి, తరువాత మీ ఇష్టం" అన్న తన తండ్రి మాటలు పూర్తికాక ముందే తన చేతిలోని ఇడ్లి ముక్కని చెల్లెలికి తినిపిస్తూ "చెల్లి! బంగారు తల్లి!" అన్నాడు చింటూ. ఎదురుచూడని ఆ సంఘటనకు ఒకరినొకరు చూసుకొని నవ్వుకున్నారా తల్లితండ్రులు.

అందరు రెడీ అయ్యి పది గంటల ప్రాంతంలో జూకి చేరుకున్నారు.చలికాలం కావడం వలన ఎండ తీవ్రత అంతగా లేదు.

జూలో జీవం లేకుండా తిరుగుతున్న జంతువులని చూసి కూడా కేరింతలు కొడుతున్నారు పిల్లలు. అదిగో ఎలుగుబంటి ఇదిగో చిరుతపులి అంటూ జూ మొత్తం కలయతిరిగేస్తున్నారు అన్నాచెల్లెళ్ళిద్దరు. పరుగులాంటి నడకలతో వాళ్ళని అనుసరించడం, ఫోటోలు తీయడంతోనే సరిపోయింది పెద్దవాళ్ళకి.

మధ్యాహ్నం జూలోనే ఉన్న రెస్టారెంట్లో భోజనాలు ముగించి మళ్ళీ తిరగనారంభించారు. అలా నాలుగు గంటల వరకు తిరిగిన తరువాత ఇంక తిరిగే ఓపిక లేదంటూ అక్కడే లాన్ లో కూర్చుండిపోయింది దీపిక. తన పక్కనే హర్ష కూడాను. పిల్లలు కూడా అలసిపోయారేమో కాసేపు అమ్మానాన్నల వడిలో కూర్చొని కబుర్లాడుకోసాగారు.

ఇంతలో ఐస్క్రీమ్ తినాలన్న కోరిక కలిగింది చిన్నారికి, కలగడం ఆలస్యం "నాన్నా ఐస్క్రీమ్, నాన్న ఐస్క్రీమ్" అని గొడవ చేయసాగింది. ఇక కొనేవరకు ఆపదని అర్థమయ్యి పిల్లలకి ఐస్క్రీమ్ కొనిపెట్టడానికి బయలుదేరాడు. దీపిక మాత్రం రాలేనని అక్కడే కూర్చుండిపోయింది.

వాళ్ళు ఆలా వెళ్ళగానే తనకి కొంత దూరంలో కూర్చున్న స్త్రీని చూసి ఆవిడ దగ్గరకు వెళ్లి "నువ్వు శిరీషవే కదూ?" అని అడిగింది.

దీపికని పోల్చుకోవడానికి ఒక క్షణం పట్టింది శిరీషకి.

"దీపూ నువ్వా! ఎన్నాళ్ళయిందే చూసి, ఎంత మారిపోయావు?" అంటూ పలకరించింది.

స్నేహితురాళ్ళు ఇద్దరూ ఆలా కబుర్లలో ఉండగానే ఒక చేతితో ఐస్క్రీమ్ పట్టుకొని చీకుతున్న పిల్లల రెండో చేయి పట్టుకొని అక్కడకు వచ్చాడు హర్ష.

"హర్షూ! ఇది శిరీష అని నా స్కూల్ ఫ్రెండ్, పదవ తరగతి అయిపోయాక మళ్ళీ ఇప్పుడే కలుసుకున్నాం" అంటూ శిరీషని పరిచయం చేసింది.

పలకరింపు కోసమని శిరీష వైపు తిరిగిన హర్ష స్థాణువైపోయాడు. ఆమె కూడా రెప్పవేయకుండా అతనినే చూడసాగింది. ఉలుకు పలుకు లేకుండా అలాగే ఒకరిని ఒకరు చూసుకోసాగారు. ఇద్దరి కళ్ళలో గతస్మృతులు కదలాడాయి.

దీపిక తన చేయి పట్టుకొని ఊపడంతో ఈలోకంలోకి వచ్చిన హర్ష పిల్లల చేతులు పట్టుకొని పెద్ద పెద్ద అడుగులు వేస్తూ గేట్ వైపు వెళ్ళిపోయాడు.

శిరీష కూడా దీపికకు చెప్పా పెట్టకుండా అక్కడ నుంచి వెళ్ళిపోయింది. దీపికకు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కారులో ఇంటికి వెళుతున్నంత సేపు దీపికతో ఏమి మాట్లాడలేదతను. ఎప్పుడు సరదాగా తనని ఆటపట్టించే హర్ష అలా గంభీరంగా,

మాట్లాడకుండా ఉండడం వింతగా తోచిందామెకు.

ఇంటికి వెళ్లి స్నానం చేసి లాప్టాప్ లో ఆఫీస్ పనేదో చూసుకొని, భోజనం కూడ చేయకుండా పడుకుండిపోయాడు.

మర్నాడు కూడా ఆఫీస్ నుంచి వచ్చిన తరువాత ముభావంగా ఉండడం గమనించి "ఏమయ్యింది హర్షా? నిన్న శిరీషని చూసిన దగ్గర నుండి ఎందుకు అదోలా ఉంటున్నావు?" అని అడిగింది దీపిక.

"ప్లీజ్ దీపూ! నా మనసేం బాలేదు, రెండు రోజులు నన్ను మాట్లాడించకు", అని మాత్రం అన్నాడు.

శిరీషకి, హర్షకి ముందే పరిచయం ఉంది అని అర్థమవుతున్నది, ఒకరికి ఒకరు ఎదురుపడలేనంతగా ఇద్దరి మధ్యన ఏదో జరిగిందని కూడా అర్థం అవుతుంది. కాని ఏం జరిగిందో మాత్రం తెలియడం లేదు. హర్ష ఆ విషయం గురించి మాట్లాడడానికే ఇష్టపడడం లేదు. శిరీషని అడుగుదామంటే హడావిడిలో తన ఫోన్ నెంబర్ కానీ ఇంటి అడ్రస్ కానీ అడగడం మర్చిపోయింది తను. ఒకవేళ కాలేజి రోజుల్లో ఇద్దరూ ప్రేమించుకున్నారేమో అన్న ఊహ వచ్చింది. కానీ హర్ష గురించి తెలిసిన తన మనసు మాత్రం ఆ ఊహ తప్పని చెబుతుంది.

ఆలోచించగా ఆలోచించగా... శిరీష తన భర్త 'కుందన్ టెక్స్‌టైల్స్' కి అధిపతి అని చెప్పడం గుర్తొచ్చింది. మర్నాడు హర్ష ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి వెళ్ళగానే తను కూడా రెడీ అయ్యి కుందన్ టెక్స్‌టైల్స్ కి బయలుదేరింది.

అక్కడ మేనేజర్ని కలుసుకొని తాను శిరీష స్నేహితురాలినని పరిచయం చేసుకొని శిరీష అడ్రస్ అడిగింది.

"శిరీష మేడం కొంతసేపటి క్రితమే ఇక్కడికి వచ్చారు, పైన గదిలో ఉన్నారు, మీరు వెళ్ళి కలవొచ్చు" అని దారి చూపించాడు మేనేజర్.

డోర్ నాక్ చేసి లోపలికి వచ్చిన దీపికను చూసి కుర్చీలో అసహనంగా కదిలింది శిరీష.

"సిరీ! నేను ఇక్కడ ఎందుకు వచ్చానో ఊహించగలవనే అనుకుంటున్నాను. మీ ఇద్దరి మధ్య ఏం జరిగిందో తెలుసుకోవాలనుంది" అన్నది.

"అది తెలుసుకోవడానికి ఇంత దూరం రావడం ఎందుకు, ఇంట్లో ఉండే నీ భర్తనే అడగవలసింది" అంటూ వ్యంగ్యంగా జవాబిచ్చింది.

"హర్ష ఆ విషయం గురించి మాట్లాడడానికే ఇష్టపడడం లేదు"

"హుః! ఎలా మాట్లాడతాడు ఏమని మాట్లాడతాడు, చేసిన తప్పుకు ప్రత్యక్ష సాక్ష్యం కళ్ళ ముందు కనబడేసరికి మాట పడిపోయి ఉంటుంది".

"ప్లీజ్ సిరీ! తను చేసిన తప్పేమిటో చెప్పకుండా నా భర్తని నువ్వలా తూలనాడుతుంటే నేను తట్టుకోలేను"

"సరే జరిగింది అంతా వివరంగా చెబుతాను విను. కాలేజి రోజులలో నీ భర్త, సాగర్ మంచి ఫ్రెండ్స్", అంటూ చెప్పనారంభించింది.

సాగర్ అన్న పేరు వినగానే రెండు రోజులనుండి హర్ష ఎందుకు అలా ఉంటున్నాడో కొంత అర్ధమయ్యింది దీపికకి.

"సాగర్ నేను ప్రేమించుకున్నాం. మేమిద్దరం ఏకాంతంగా గడపడానికి ఏ సినిమాకో,షికారుకో వెళితే హర్ష కూడా మాతోపాటు వచ్చేవాడు. అతని చూపులు, చేష్టలు చాలా వెకిలిగా అనిపించేవి నాకు. అతనలా మాతో రావడం నాకు ఇష్టం కూడా ఉండేది కాదు. ఒకరోజు సాగర్ నాతో ఏదో మాట్లాడాలి అంటున్నాడని, అర్జెంటుగా రూముకి తీసుకురమ్మన్నాడని చెప్పాడు హర్ష. అతనితోపాటు రూముకి వెళ్లిన నాకు అక్కడ సాగర్ కనిపించలేదు. ఏమిటిదని అడిగేలోపే తలుపుకు గొళ్లెంపెట్టి నన్ను బలాత్కరించబోయాడు. అప్పుడర్ధమయ్యింది నాకు హర్ష మాతో ఎందుకు వచ్చేవాడో, అతని చూపుల వెనుక చేష్టల వెనుక ఉన్న మర్మమేమిటో. దేవుడి దయ వలన సమయానికి గోపాల్ వచ్చి తలుపు తట్టడంతో ఆరోజు అతని చేతులలో నుంచి తప్పించుకోగలిగాను. మర్నాడు సాగర్ ని కలిసి విషయం చెబితే 'హర్ష అలాంటివాడు కాదే? ఎక్కడో ఏదో పొరపాటు జరిగినట్టుంది' అని తన మిత్రుడి తరుపున మాట్లాడేసరికి నాకు సాగర్ మీద అసహ్యం వేసింది. అతని మీదున్న నమ్మకం పోయింది. 'నేను చెబుతున్నా నమ్మకుండా నువ్వు హర్షనే సమర్ధిస్తున్నావన్న మాట, నమ్మకం లేని చోట ప్రేమ ఉండలేదు సాగర్. రేపు మనిద్దరికీ పెళ్ళయిన తరువాత అతనొచ్చి నన్ను ఏదన్నా చేసినా తప్పు నాదే అనేలా ఉన్నావు. నీలాంటి వాడితో జీవితాంతం ఉండాలనుకోవడం నాదే తప్పు, ఇంకెప్పుడు నన్ను కలవాలని ప్రయత్నించకు' అని చెప్పేసి వెళ్ళిపోయాను. ఆలా వెళ్ళిపోయిన రెండు నెలల తరువాత కుందన్ తో నా పెళ్లి జరిగింది. పెళ్లి అయిన రెండోరోజు తెలిసింది నాకు, నా విషయం గురించి సాగర్, హర్షలు గొడవపడ్డారని దాని పర్యవసానంగా సాగర్ ఆత్మహత్య చేసుకున్నాడని" అని ముగించింది.

ఇదంతా విన్న దీపికకి ఆ ఏసి రూములో కూడా చెమటలు పట్టేసాయి. తన బెస్ట్ ఫ్రెండ్ సాగర్ ఆత్మహత్య చేసుకున్నాడు అని

ఎన్నో సార్లు చెప్పిన హర్ష, దానికి కారణమేమిటో ఒక్క సారి కూడా చెప్పలేదు.

ఏమి మాట్లాడలేని స్థితిలో వెనుతిరిగి వెళుతున్న దీపికని ఉద్దేశించి "అలాంటి దుర్మార్గుడిని పెళ్లి చేసుకున్నందుకు... ఐ రియల్లీ పిటీ యు!", అంది కర్కశంగా.

శిరీష చెబుతున్నప్పుడు ఏమి మాట్లాడలేకపోయింది కానీ ఇంటికి తిరిగి వెళుతూ ఆలోచిస్తుంటే తన భర్త ఆలా చేసి ఉండడని అనిపించసాగింది. హర్షని కూడా అడిగి అతను చెప్పింది వినేవరకు ఒక నిర్ధారణకు రాకూడదు అనుకుంది.

ఆ రాత్రి పిల్లలు పడుకున్న తరువాత హర్ష దగ్గరకు వచ్చి "నేను శిరీషని కలిసాను" అంది దీపిక. నిర్లిప్తంగా చూసాడతను.

"తను నీ గురించి ఏదేదో చెబుతుంటే విని తట్టుకోలేకపోయాను"

"తన మాటలు నువ్వు నమ్ముతున్నావా?", మొదటిసారిగా ఈ విషయం గురించి స్పందించాడు.

"నేను నమ్మడం ముఖ్యం కాదు.....", అని ఏదో చెప్పబోతున్న దీపికని మధ్యలోనే ఆపి

"అదే ముఖ్యం దీపూ! నువ్వు తను చెప్పినది నమ్మినట్టయితే నేను ఏమి చెప్పినా నమ్మే స్థితిలో ఉండవు", స్థిరంగా అన్నాడు.


"ఇన్నేళ్లు నీతో కాపురం చేసిన దానిగా నువ్వెంటో నాకు తెలుసు. కానీ తను నీ మీద పడ్డ నింద అబద్ధం అని తెలిస్తే కానీ నా మనసుకు కుదురు ఉండదు"

"సరే! జరిగింది ఏమిటో చెబుతా విను", అని చెప్పడం మొదలుపెట్టాడు.

"మేము ఫైనలియర్ లో ఉండగా ఒకరోజు సాగర్, శిరీషల ప్రేమ సంగతి సాగర్ వాళ్ళ నాన్నకు తెలిసి చాలా కోప్పడ్డారు. ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేస్తే కాలేజీ మానిపించేస్తామన్నారు. అందుకే చదువయిపోయి ఉద్యోగం వచ్చేవరకు శిరీషని కలుసుకోకూడదు

అనుకున్నాడు. ఆ విషయం చెప్పడానికి తనని రూముకు తీసుకురమ్మన్నాడు. కాని నేను శిరీషని తీసుకువచ్చేసరికి సాగర్ రూములో లేడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ లో ఉంది. మూడు గంటల తరువాత, ఎవరో ఒక ఫ్రెండ్ కి ఆక్సిడెంట్ అయితే హాస్పిటల్ తీసుకువెళ్లాడని గోపాల్ వచ్చి చెప్పాడు. ఆ తరువాత శిరీషని పంపించేసి నేను, గోపాల్ హాస్పిటల్ వెళ్లాము. ఇది జరిగిన రెండు రోజుల తరువాత నుండి నాతో ఎక్కువ మాట్లాడే వాడు కాదు సాగర్, ఏమయ్యిందని ఎన్ని సార్లు అడిగినా సమాధానం ఉండేది కాదు. శిరీషతో మాట్లాడలేక పోతున్నందుకు బాధపడుతున్నాడేమో అనిపించింది. ఇదిలా ఉండగా ఒకరోజు గోపాల్ వచ్చి శిరీషకి రెండు రోజులలో పెళ్లి జరగబోతుంది అని చెప్పాడు. అది విని సాగర్ నేను షాకయ్యాము. కొంతసేపు మౌనంగా ఉన్న సాగర్, ఇదంతా నావల్లే జరిగింది అని, నేను ఆరోజు శిరీష మీద అఘాయిత్యం చేయకపోయి ఉన్నట్టయితే శిరీష తనకే దక్కేదని ఏవేవో నిందలు వేసాడు. అది విని అదిరిపడ్డాను నేను, గోపాల్ కూడా ఉలిక్కిపడి చూసాడు. నేను శిరీష మీద అఘాయిత్యం చేశానని ఎవరు చెప్పారని అడగగా శిరీషే చెప్పిందన్నాడు. వాడు ఇన్నిరోజులు నాతో సరిగా మాట్లాడకపోవడానికి కారణం అప్పుడర్ధమయ్యింది నాకు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందని నేను వెళ్లి శిరీషతో మాట్లాడి వస్తానని సాగర్ కి చెప్పి గోపాల్ ని తీసుకొని శిరీష వాళ్ళ ఊరు వెళ్ళాను. మర్నాడే పెళ్లి కావడంతో ఇల్లంతా కోలాహలంగా ఉంది. శిరీష కోసం వెతుకుతున్న మాకు పక్క రూంలో నుండి మాటలు లీలగా వినిపించసాగాయి. 'సాగర్ ని వదిలించుకోవడానికి ఆ విధంగా హర్షని ఉపయోగించుకున్నాను...' అని ఎవరికో చెప్పి నవ్వుతుంది శిరీష. అది విన్న గోపాల్ కి, నాకు ఇక శిరీషతో మాట్లాడడం అనవసరం అనిపించింది. సాగర్ కి విషయం ఎలా చెప్పాలా అని నేను ఆలోచిస్తున్నంతలోనే గోపాల్ జరిగినదంతా సాగర్ కి ఫోన్ లో చెప్పేసాడు. అలాంటి అమ్మాయిని ప్రేమించానన్న పశ్చాత్తాపంతోనో, లేక అలంటి అమ్మాయికోసం ప్రాణస్నేహితుడనైనా నాతో గొడవ పడ్డానన్న బాధతోనో తెలియదు కాని మేము వెళ్లేసరికి సాగర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వాళ్ళ అమ్మానాన్నా మాత్రం వీడి ప్రేమని కాదన్నందుకు బాధతో చనిపోయాడు అనుకున్నారు. శిరీష మీద పోలీస్ కంప్లైంట్ ఇద్దామనుకున్న నన్ను గోపాల్ నిలువరించాడు. కొత్తగా పెళ్ళయిన ఆడపిల్ల పోలీసులని, కోర్టులని తిరుగుతుంటే ఆ పిల్ల తల్లితండ్రులు తట్టుకోలేరని, ఆ అబ్బాయి కుటుంబానికి కూడా తలవంపులని, తనను ఏమి చేసినా పోయిన వాడు తిరిగి రాడని బ్రతిమలాడి, బలవంతంచేసి నన్ను ఆపాడు. అలా నా ప్రాణస్నేహితుడి చావుకు కారణమైన ఆ కర్కశిని ఇన్నాళ్ల తరువాత చూసేసరికి జ్ఞాపకాల అలజడి నా మనసును స్థిమితంగా ఉండనీయడం లేదు. ఈ రెండు రోజుల నుండి నాలో జరుగుతున్నా మానసిక సంఘర్షణ ఎవరికీ చెప్పుకోలేక, నాలోనే దిగమింగుకోలేక నరకం అనుభవిస్తున్నాను", అంటూ ముగించాడు.

ఆ తరువాత అతనేమీ మాట్లాడలేదు. దీపిక కూడా ఏమి అడగలేదు, కానీ ఆ రాత్రంతా ఆలోచిస్తూనే ఉంది. ఇద్దరూ చెప్పిన కథ ఒకటే కానీ ఎవరికి వారు పక్కవాళ్ళని దోషులుగా చిత్రిస్తున్నారు. ఇప్పటివరకు వాళ్ళిద్దరి మధ్యా జరిగినది ఏమిటో తెలుసుకుంటేనే కానీ కుదురు ఉండదు అనుకుంది, కానీ తెలుసుకున్న తరువాత మరింత సందిగ్ధత ఏర్పడింది. ఈ చిక్కుముడి వీడేదెలా అని ఆలోచిస్తుండగా హర్ష ఫ్రెండ్ గోపాల్ గుర్తొచ్చాడు. అతనిని కలిసి అతని తరపు కథ కూడా వింటే ఎవరిది తప్పో ఎవరు ఒప్పో తెలిసిపోతుంది అనుకున్న తరువాత మనసు తేలికపడి కునుకుపట్టింది.




నల్లగా...దట్టంగా.. మేఘాలు.

నీలాకాశం కింద నలుపెక్కి...బరువెక్కి...ఇప్పుడో అప్పుడో చినగడానికి సిద్ధంగా ఉన్న పేద్ద గోనె సంచుల్లా ఊగుతున్నాయి! అప్పటి దాకా ఎక్కడున్నాయో...ఇంత లోనే ఎలా వచ్చాయో... కదలి పోతాయో... కరిగి పోతాయో. తనపై అలుముకున్న... పులుముకున్న మబ్బుల్ని చూడగానే నగరం వెన్ను వణికింది. సాయంత్రం 5 గంటలకే కటిక చీకట్లు ...మబ్బుల్ని చిల్లు పొడిచి చినుకుల్ని కసి దీరా నేల కేసి కొట్టేందుకు కుట్ర కుట్రగా కమ్ముతున్నాయి.

దడేల్...!!

పిడుగులు ఒక్కసారిగా పగిలినట్టు భయంకర శబ్దం. మేఘం సంచి సర్రున చిరిగి పోయింది. చినుకులు పై నుంచి బాణాల్లా వేటాడుతూ వెంటాడుతూ...జనాలు కంగారుగా రాసుకుంటూ తోసుకుంటూ పరుగులు తీస్తున్నారు. ఉగ్రంగా... మహోగ్రంగా...ఆకాశ గంగ దుముకుతోంది. డీటీహె చ్ సౌండ్‌లా చినుకుల చప్పుడు . బస్సుల రంకెలు...కారుల కుయ్యో మొర్రలు వినిపించనంతగా శబ్దిస్తూ చినుకులు!

——— ———  ————

పంజాగుట్ట బస్టాప్. చినుకులు మేకుల్లా గుచ్చుతున్నాయి. ఉండి ఉండి వీస్తున్న ఈదురు గాలికి చినుకులు ఓ వైపుగా ఒరిగి పోతున్నాయి. పార్టీ ఫిరాయిస్తున్న నేతల్లా. బస్టాప్ గా పిలుచుకునే చెప్పుల దుకాణం ముందు జనాలు. పైసా బేరం లేదు...షాపు ముందు జనం జాతర. వర్షం అంతకంతకు విజృభిస్తుంటే ఓనరు మాత్రం ఏం చేస్తాడు. అటూ ఇటూ కదులుదామంటే అష్ట దిగ్బంధం! కుడి వైపు చిన్న సైజు కొండలా  ఓ మహానుభావుడు... ఎడం వైపు ఓ  మాటి మాటికీ చేతుల్తో చినుకుల్ని తరిమేస్తున్న పట్టుచీరావిడ! ముందేమో సరిగ్గా ముక్కుకు తలానిస్తున్న మిస్టర్ ఉద్యోగం!  చెవికి ఫోన్ ...తలూపుతున్నప్పుడల్లా వెనకటి క్రాపు వెంట్రుకొకటి తుప్పుపట్టిన మేకులా... ముక్కుకు రాసుకుంటోంది. తుమ్ముదామంటే చుట్టు పక్కల తలలు! అసలు ఈ ఉద్యోగంని కాదు వీడికి కటింగ్ చేసిన ఆ వెధవాయిని వాయించాలి! కనీసం  వీడు గుండు కొట్టించుకున్నా బావుణ్ను.  ఆ తిరుపతికో ...ద్వారకా తిరుమలకో... యాదగిరి గుట్టకో నీ వెంట్రుకల్ని ఇచ్చేసుకోవయ్యా మిస్టర్ ఉద్యోగం ప్రమోషన్ గ్యారంటీ వచ్చుద్ది . కనీసం  నీ వెనకోళ్లకి ఇరిటేషన్ అయినా తగ్గుద్ది. ఏంటో ఈ చెత్తాలోచన్లు! చికాకు పెరిగితే ఇంతేనేమో!!

———

ధారాళంగా వర్షం. కుంట్ల జలపాతంలా!!

రోడ్డుపై మడుగు కడుతున్న నీళ్లు. ఒబెసిటీతో బాధపడుతున్న మనిషిలా మెట్రోబస్సు బరువుగా మడుగులో ఈదుకుంటూ వచ్చింది. వెనక గొట్టం నుంచి దట్టంగా పొగ .అందరిపై నల్ల దుప్పట్లా పరచుకుంటోంది. బస్సు చూడగానే గుంపు జనం ఒక్క సారిగా కదిలాం. రాసుకుంటూ...తోసుకుంటూ... తిట్టుకుంటూ!  చేతిలో లంచ్ బ్యాగ్ గట్టిగా పట్టుకుని గుంపు చీల్చుకుంటూ బస్సు డోర్ వద్దకి చేరుకున్నా. బైటెంతో లోపల అంతే జనం! సీనియర్ సిటిజన్స్ సీటు ఒకటి ఖాళీగా ఊరిస్తోంది. పంటి బిగువున శక్తి కూడ దీసుకున్నా!  అబ్బా నాకాలు ... ఏంటి తొక్కేస్తున్నారు... ఆగవయ్యా కనపడట్లా... ఎవ్వడేమన్నా బేఖాతర్! అర్జునుడికి చెట్టు కొమ్మపై పక్షి కన్నుమాత్రమే కనిపించినట్టు నాకు సీటు తప్ప మరేదీ కనిపించట్లేదు...వినిపించట్లేదు. కాస్త దగ్గరవగానే చేతిలో బ్యాగు సీటులోకి గిరవాటేశా! హమ్మయ్యా సీటు దొరికినట్టే. పక్కన ఓ అమ్మాయి కూచోనుంది. నా అవస్థ చూసి ‘అంకుల్ ఆ సీట్లో నీళ్లు...’ అంది. అర క్షణం ఆలోచించా... పంజా గుట్ట నుంచి కొత్త పేట. నో ఆప్షన్.. సీట్లో కూలబడ్డా! స్పాంజి సీటులోంచి నీళ్లు ఒక్క సారిగా ఊరి ప్యాంటుకు చల్లగా తాకాయి.  బోర తెరచుకుని  విండో గ్లాసు. చినుకులు లోనికి వచ్చేస్తున్నాయి. రెండు చేతుల్తో డోర్ లాగుతున్నా. ‘అది రాదంకుల్’ పక్కనున్న అమ్మాయి . మళ్లీ సీట్లో కూలబడ్డా.  సీటు కింద తడికి...పక్కనుంచి గుచ్చుకుంటున్న చీదర చినుకులకి శరీరం ట్యూన్ అయింది. అయినా బస్సులో సీటు దొరకబుచ్చుకోవాలంటే అంత వీజీ కాదు. దానికి బోల్డెంత అదృష్టం...కాసింత టెక్నిక్ ఉండాలి. ఇంతలో  డోర్ వద్ద కొండల్రావ్

...అదే చిన్న సైజు కొండలా బండాయన కనిపించాడు. వెనకాల జనం గోల గోల . వీడు ఓపట్టాన డోర్లోంచి రావట్లేదు. బైట వర్షంలో జనాలు అసహనంగా. లోపల్నుంచి ఎవరో చేయి పట్టి లాగేశారు. ఓ పేద్ద లగేజిలా బస్సులో పడ్డాడు. కొండల్రావ్‌ని తోసుకుంటూ జనాలు బిల బల వచ్చేశారు. ఎదర సీట్లో ఆరు సార్లు కిందకి దిగాలని సీట్లోంచి లేచి కూర్చొన్న ఆవిడ మరో సారి లేచింది. పక్కనే నిలుచున్న పట్టు చీర కోపంగా 'వెళ్లాలంటే వెళ్లు...ఎన్నిసార్లలా లేచి కూచోడం...'అంటోంది అసహనంగా!

---

బస్సు కదులుతోంది భారంగా అటూ ఇటూ ఊగుతూ! వర్షం కుమ్ముతునే ఉంది.

రోడ్డు కిరువైపులా మోతెక్కి పారుతున్న నీళ్లు . .కొట్టుకు పోతున్నట్టు కార్లు...మోటారు సైకిళ్లు...ఆటోలు...జనాలు. నీళ్లలో మెరుస్తున్న సిటీ లైట్లు . ఈ వర్షం ఓ పట్టాన తగ్గేట్టు లేదు. రాత్రి వచ్చిన వర్షం...బంధు గణం ఓ పట్టాన పోవని అమ్మ అంటూండేది. సీటు వెనక్కి ఆనుకున్నా వీపుకు నీళ్లు తగులుతున్నాయి. సోమాజి గూడా... కండక్టర్ కేకలు. " టికెట్ తీసుకోండి...పాస్ చూపించండి...నెక్స్ట్ స్టాప్ చెకింగ్..." నవ్వొచ్చింది. వీడి బండపడ! అసలే వర్షం ఉతికి ఆరేస్తుంటే...చెకింగ్ ఏంట్రా బాబూ! బస్సాగింది. నలుగురు దిగారు...పది మంది ఎక్కారు! ఓ ముసలావిడ ఆపసోపలు పడుతూ వస్తోంది. పక్కనున్న అమ్మాయి వైపు జాలిగా చూశా! ఆ పిల్లా బిక్కుబిక్కుమంటూ చూసి కళ్లు మూసుకుంది...దొంగ నిద్ర! పాపం ప్లాన్ ఫెయిల్... సరిగ్గా ఆ ముసలావిడ వచ్చి నిలుచుంది. వెనకాల కూతురు కామోసు...'హలో...' అమ్మాయిని కదిపింది. క్షణం తర్వాత సీట్లో ముసలావిడ...నీరసంగా నిలుచున్న అమ్మాయి. వర్షంలో పూర్తిగా తడిసిన ముసలావిడ వణికి పోతోంది.

'అమ్మా... తుడుచుకోవే...'కూతురు నాప్‌కిన్ ఇచ్చింది.

'చలిగా ఉందే...'

'ఎందుకుండదూ...చెబితే విన్నావా. ఎలా బడితే అలా తిరగొద్దని''

'నాకేం తెలుసే వర్షం వస్తుందని'

‘… ఇంట్లో మూలలో కూర్చొని నావల్ల కాదే. పొద్దు పోదు’

‘ఆ…ఇప్పుడు పోతుందిగా. ఇల్లు చేరే సరికి అర్ధ రాత్రో అప రాత్రో ’మాటల్లో భరించ రానంత విసుగు.

ముసలావిడకు ఏడు పదుల వయసనుకుంటా…చర్మం ముడతలు దేరినా…నిమ్మ పండు ఛాయ! ఆ కళ్లల్లో ఎన్నెన్ని ఆకాంక్షలో! అంత తడి లోనూ చుట్టు పక్కల జనాల్ని చూసి మురిసి పోతోంది. లైఫ్ రీఛార్జి చేసుకుంటోందేమో!

———

ఉన్నట్టుండి బస్సు ఆగింది తూగింది. డ్రైవరు ఫ్రంట్ బ్రేక్ కొట్టినట్టున్నాడు. జనాలు తూలారు. పర్సు లోంచి డబ్బు తీద్దామనుకున్న ఓ అమ్మాయి దబేల్న పడింది. అరెరె…అయ్యయ్యో… పడి పోయింది…పడి పోయింది… చుట్టు పక్కలోళ్లు లేవదీస్తున్నారు. ఆ అమ్మాయి పర్వా లేదని వారిని సున్నితంగా తప్పించు కుంటోంది.

‘కాస్త చూసి నడపొచ్చుగా…ఫ్రంట్ బ్రేకు వేసేయడవే!’ కొండల్రావ్ కేకెట్టాడు.

‘అమ్మాయి ఏం తాక లేదుగా…’ పక్కామె అడుగుతుంటే…ఆ వైపున నిల్చున్న పట్టు చీర…‘అరె మోచేతికి దెబ్బ తాకినట్టుందే’ పరామర్శతో కూడిన ఆరా. అసలే మర్యాద పోయినట్టు ముడుచుకు పోయిన ఆ అమ్మాయి కళ్లల్లో విసుగు. ఏం మాట్లాడక పైన స్ట్రిప్ పట్టుకుంది.

———

బస్సు కదలట్లేదు. కొంప దీసి రిపేరా? ద్యావుడా!

సీట్నుంచి కాస్త లేచి చూశా. బస్సు ముందర బైకు. వాడు తన ముందున్న ఆటో వాడితో గొడవ పెట్టుకున్నాడు. హోరు వర్షంలో ఇద్దరూ అంత కన్నా హోరుగా వాదించుకుంటున్నారు. బస్సు వెనక పది స్కూటర్లు…మరో పది ఆటోలు…ఓ రెండు మూడు లావు

పాటి బస్సులు ..బొయ్…బొయ్…అంటున్నాయి. కండక్టరు కిందకి దిగి వారిద్దరికి సర్ది చెప్పి దారి చేశాడు. హమ్మయ్యా బస్సు కదిలింది. వర్షం తన పని తాను చేసుకు పోతోంది.

———

'క్యుములోనింబస్ మేఘాలట! అవి వచ్చాయంటే కుమ్మేస్తాయంతే!' వెనక గుంపులో ఒకాయన అంటున్నాడు.

'ఆ ఏం నింబస్సో! అయినా సిటీలో కురిసి ఏం లాభం…పొలాల్లో కురవాలి గానీ' ఎవరా అని తల తిప్పి చూశా! అరె మన ఉద్యోగం! ఏం సెబితిరి…ఏం సెబితిరి…ఆర్డరేసినట్టు వర్షం వస్తే ఎంత బావుణ్నో!

'మీకు తెలుసా…ఈ క్యుములోనింబస్ మేఘాలు అప్పటికప్పుడే తయారవతాయట! కొండల్రావ్ ఉవాచ!

'ఇనస్టంట్ కాఫీ లాగానా…' మిస్టర్ ఉద్యోగం వెటకారం.

'అలాంటిదే అనుకోండి. గత వందేళ్లుగా నగరంలో అక్టోబర్ నెలల్లో ఇలాంటి వర్షం పడ లేదట' విజ్ఞానంతో యిరగ దీస్తున్నాడు కొండల్రావ్. పేపర్ని కరకరా నవిలి మింగేసిన సమాచారాన్ని మాటలకు పట్టించేస్తున్నాడు.

————

'చిట పట చినుకులు పడుతూ ఉంటే…' వెనక సీట్లో ఓ మిడిలేజ శాల్తీ బాన పొట్టేసుకుని మొబైల్లో పాట ఆస్వాదిస్తున్నాడు. హెడ్ సెట్ పెట్టుకు చావచ్చుగా…పోనీలే పాత పాట బాగానే ఉంది. అయినా వీడి టేస్టుకు మెచ్చుకోవాలి. సరిగ్గా వర్షం చూసి పాట పెట్టాడు గురుడు. వానా వానా వందనం…వానొచ్చిందంటే వరదొస్తది…కురిసింది వానా…చినుకులా జారి… ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా..గాన లహరి లో వళ్లు తేలి పోతోంది.

'ఏయ్…రేపు క్యాంపస్ డ్రైవ్ '

‘ఎవరు చెప్పారే’

‘నీ మొహం…మెసేజ్ చూస్కో లేదా…’

‘వాట్సప్…ఫేస్బుక్ తప్ప మరేం చూడదే అది…’

‘అరె…ఇప్పుడే వచ్చింది…చచ్చాం ప్రిపేరు కాలేదు కదే’

‘ సర్లే మనం ఎప్పుడయ్యాం…’

‘రేపు కూడా ఇలాగే రెయినొస్తే బావుణ్ను…’

‘ఇప్పుడు తడిసింది చాల్లేదేవే’

‘కాదే పిచ్చి మొహమా…డ్రైవ్ పోస్ట్ పోన్డ్ డ్యూ టు హెవీ రెయిన్… అంటూ మెసేజ్ వచ్చేస్తుందిగా…’

నవ్వులు పువ్వులు పూస్తున్నాయి. బీటెక్ గుంపు చేరినట్టుంది. పాటలకు కోరస్ లా కబుర్లు.

కిటికీ వైపు తడుస్తున్న ఎడం చేయి మొద్దు బారుతోంది. ఛా…బస్టాప్ ఎప్పుడొస్తుందో??

---

కోఠీ వచ్చింది. కోటి కలల కోఠీ! మరి ఇప్పుడో... సిటీ నలు మూలలా షాపింగ్ మాల్స్. అయినా సరే ఈస్ట్ మన్ కలర్ సినిమా హీరోయిన్‌లా పాత అందాలతో మెరిసి పోతుంటుంది. ఈ మాయ దారి వాన నీళ్లు కోఠీ సందు సందునా చొచ్చుకు పోతున్నాయి. షాపుల్లో ...బిల్డింగుల్లో నీళ్లు...మోటర్లేసి తోడుతున్నారు. మళ్లీ లోపలికి వచ్చేస్తున్నాయి. చెరువుల్ని మింగేసిన ఆ బిల్డింగుల్లో ఎంత తరిమేస్తున్నా నీళ్లు చొరబడుతునే ఉన్నాయి. తప్పి పోయిన పిల్లలు తల్లిని వెదుక్కొంటున్నట్టు. ఫుట్ పాత్ బిజినెస్ టార్పాల్ ముసుగేసుకుంది. సెకండ్ హాండ్ పుస్తకాల షాపులు వరసగా. అన్నీ బీటెక్ పుస్తకాలే! అప్పుడెప్పుడో పాత పుస్తకాల షాపులన్నీ ఒకే చోట...ఇంగ్లీష్, తెలుగు నవలలకు కొదవే లేదు. అక్కడే రా.రా. లేఖలు పుస్తకం దొరికింది. కొట్టోడు పది చాలంటున్నా, పదిహేను చేతిలో పెట్టా! నన్నో ఫూల్ లా చూశాడు. ఎందుకో పది రూపాయలకే రాచమల్లు గారిని ఇంటికి పిలుచుకెళ్లడం సరి కాదనిపించింది. అంత వర్షంలోనూ వేడి వేడి మిర్చీ పొట్లంలా గోకుల్‌చాట్ ఘుమ ఘుమ లాడుతోంది. ఎప్పుడూ బాక్సాఫీసు బద్దలయిన సినిమా టాకీసులా ఉండేది. వర్షం కదా జనాలు పలచగా కనిపిస్తున్నారు. డివైడ్ టాక్ సినిమా రష్‌లా! తడిసి ముద్దయిన ఓ నలుగురు పిలగాళ్లు చాలా శ్రద్ధగా కుల్ఫీకి చుట్టిన ఉల్లి పొర లాంటి తెల్ల కాయితాన్ని ఊడ దీస్తున్నారు. జుర్రుకో బోయే తియ్యందనాన్ని ముందుగా ఆస్వాదిస్తున్నారు. అక్కడక్కడా పడి ఉన్న ఉల్లి పొర తెల్ల కాయితాలు వర్షంలో తడుస్తూ మెరుస్తున్నాయి. మరో ఇద్దరు ఇంత వర్షంలోనూ చేతిలో కుల్ఫీతో ఫొటో తీసుకుంటున్నారు.

ఓహ్...కుల్ఫీ తో సెల్ఫీ! వాటే లవ్ లీ థాట్!

కరిగి నీరై పారి పోయిన యవ్వనం గుచ్చుకుంటోంది. గుండెలో ఖవ్వాలి.

---

గుంజుకుంటూ గింజుకుంటూ మరో అరగంట వర్షంలో కరిగింది.

చాదర్ ఘాట్...సిటీ లోని బాటిల్ నెక్ ప్రాంతాల్లో ఇదొహటి. బస్సు కుడి వైపు మలుపు తిరిగి కాజ్‌వే పై జారింది. బస్సు...కారు...ఆటో...బైకు...ఒక్కొక్కటిగా వరసగా జారుతున్నాయి. ట్రాఫిక్ జామ్ ఇప్పట్లో తెగేలా లేదు. కోఠీలో ఓ మోస్తరు వాన చాదర్ ఘాట్ బ్రిడ్జి వద్ద పదునెక్కింది. నల్లా గొంతులో నల్ల సముద్రంలా వాహనాలు కదులుతున్నాయి. కుంజరయూధంబు దోమ కుత్తుక జొచ్చెన్...! దోమ గొంతులోకి ఏనుగుల మంద అనేగా! ఆ తెనాలి రామ లింగడికి చాదర్ ఘాట్ లాంటి బ్రిడ్జేదో తగిలుంటుందేమో! బస్సు ఎడం వైపు మలిపింది. ఎదర రైలు బ్రిడ్జిపై మెలికలు తిరిగిన మిన్నాగు లా మెట్రో లైను. పక్క సీట్లో నిమ్మ పండు చాయ ముసలావిడ బైట కనిపించే ఏ దృశ్యాన్ని వదలట్లేదు. ఇంతింత కళ్లేసుకుని చూస్తోంది. పాపం ఎన్ని రోజులైందో బైటి ప్రపంచం చూసి. ఈ ముసలి తనం ఉందే..తన్ని తగలేయాలి...ఛ!
లేవాలన్నా...కూచోవాలన్నా...తినాలన్నా...పడుకోవాలన్నా.. అన్నింటికీ అడుక్కోవాల్సిందే! అప్పుడే కోరికలు యవ్వనంలా మెరుస్తుంటాయి... గోల పెడుతుంటాయి. నల్గొండ చౌరస్తా రాగానే బీటెక్ బ్యాచి బిల బిల మంటూ దిగింది.

అయ్యో… వసంతం వెళ్లి పోయిందా…!!

————

కొత్త పేట ఫ్రూట్ మార్కెట్ …దిగాల్సిన స్టాప్. సీట్లోంచి లేచా… ముసలావిడ చంద మామ లా నవ్వుతూ లేచింది. సో గ్లామరస్.. మాంఛి వయసులో ఉన్నప్పుడెలా ఉండేదో…ఎంత మంది పిల గాళ్లను తిప్పుకుందో. వర్షం జోరు తగ్గినా సన్నగా చినుకులు…చికాకు పెట్టేందుకు ఎంత అవసరమో అంత! ముసలామెను కూతురు జాగ్రత్తలు చెబుతూ దించింది. 'నాగోల్ …నాగోల్…' షేర్ ఆటోలు తడుస్తూ …డ్రైవర్లు అరుస్తూ..!

తప్పని సరిగా తడుస్తూ నడుస్తున్నా. వెనక నుంచి కొత్త కారు సర్రున దూసుకొచ్చింది. పక్కకు పరిగెత్తా. దబాల్న ఏదో పడ్డ చప్పుడు. అమ్మా….అమ్మా! వెనుదిరిగి చూశా. నిమ్మ పండు రంగు ముసలావిడ పడి పోయింది. కూతురు కంగారుగా అరుస్తోంది. కారు కాస్త ముందెళ్లి ఆగింది. డోర్ తెరచి యువకుడు కంగారుగా వచ్చాడు. క్షణం ముందు బస్సులో చూశా… ఇప్పుడు రోడ్డుపై అచేతనంగా! కూతురు వెర్రిగా ఏడుస్తోంది. వర్షం జాలిగా కురుస్తోంది. ఒక్క సారిగా షాక్ కొట్టినట్టయింది. ఆ యువకుణ్ని జనాలు గుంపేశారు. ఈ లోగా రెయిన్ కోటు వేసుకున్న పోలీస్ ప్రత్యక్షమయ్యాడు. చేతిలో ఫోన్! వర్షంలో నిగ నిగ లాడుతున్న కారు ఏమీ తెలిని నంగనాచిలా నిలుచుంది. నంబర్ ప్లేట్ పై పసుపు స్టిక్కర్…దాని పై జారుతున్న నీటి చుక్కలు. కడుపులో చేయి పెట్టి దేవినట్టు ఫీలింగ్. నిలువ బుద్ధి కాలేదు. గుంపు దాటుకుని నడిచా. తల దిమ్ముగా ఉంది. షేర్ ఆటో ఎక్కగానే..'భయ్యా ఇప్పుడైనా పోనీ రాదే…' పాసింజరు వేడుకోలు. ఓకే కాకా


రైట్…రైట్…రోడ్డెక్కించాడు.

అపార్ట్‌మెంట్ వచ్చింది. కరెంటు లేదు. ఆటో దిగి భారంగా కదిలాను. వానొచ్చెనంటే వరద…డ్రైవ్ పోస్ట్ పోన్…అంకుల్ నీళ్లు… తెలుసా క్యుములోనింబస్… టికెట్…టికెట్… చెకింగ్ ఉంది సార్…అంతా రీమిక్స్‌లాగా బుర్రలో తిరుగుతూ తిమ్మిరి తిమ్మిరిగా ఉంది.

ఇంత గందర గోళం లోనూ నిశ్చలంగా నిమ్మ పండు రంగు ముసలావిడ బొమ్మ మెరుస్తోంది. ఆశలన్నీ తీర్చుకున్నట్టు. అప్పడ్దాకా పెదాలపై విరిసిన నవ్వు తాలూకు పరిమళం అత్తరులా మనసును తాకుతోంది. రెండు గంటల వాన గుండెలోజ్ఞాపకలాల జల్లుల్ని చిలకరించింది. గుమ్మం ముందు నిలవ గానే నిస్సత్తువ ఒక్క సారిగా తీసేసినట్టయింది. తడిసిన తలపుల్ని ఒడిసి పట్టుకుంటూ చినుకు తునకలా ఇంట్లో అడుగు పెట్టా!

పక్కింటి కుర్రాడు గుక్క తిప్పుకో కుండా అరుస్తునే ఉన్నాడు.

'రెయిన్ రెయిన్ గో అవే...కమ్ అగైన్ అనదర్ డే...'




నా పేరు "కుందేలు". అవునండీ ..నా పేరు నిజంగానే కుందేలే . ఏంటి ?...      అడవిలో జంతువుననుకొంటున్నారా .. ? కాదండి. ఆ జంతువు వేషంలో ఉన్న ఓ 'నిరుద్యోగిని'. ప్రస్తుతానికైతే నిరుద్యోగిని కాదులెండి. ఎందుకంటే 'కుందేలు' వేషంలో డబ్బులు సంపాదిస్తున్నాను కాబట్టి.

నా     ఉద్యోగం ఉదయాన్నే బట్టల దుకాణం తెరిచినవెంటనే ప్రారంభమౌతుంది. దుకాణం ముందర 'కుందేలు ' వేషం లో గెంతుతూ .. ఆడుతూ . పిల్లలని , పెద్దలని ఆకర్షించడమే నా ఉద్యోగం. నా తో పాటే ఇంకా ఏనుగు, ఎలుగుబంటి , పులి కూడా ఉన్నాయండి.        మేము పనిచేసే బట్టల దుకాణం ఈ మధ్యే క్రొత్తగా ప్రారంభమయ్యింది. ఆ దుకాణం యజమాని అందరినీ ఆకర్షించి , తన బట్టల అమ్మకాలు పెంచుకునేందుకు మమ్మల్ని ఏర్పాటు చేసాడు.

మాది     ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం. పదవీవిరమణ చేసిన నాన్న చిరు పెన్షన్ మీద, చెల్లలు చెప్పే ట్యూషన్స్ మీద వచ్చే ఆదాయం తో ఇల్లు గడుస్తున్న పరిస్థితుల్లో, గ్రాడ్యుయేషన్ చేసి , ఏ ఉద్యోగం దొరకని నాకు ఈ ఉద్యోగమే పరమావధి

అయ్యింది. చదువుకున్న చదువుకు ఎంత మాత్రం సంభంధం లేని ఈ వేషమే ఇంత కూడు పెడుతోంది.

ఇంక మా వేషాల గురించి చెప్తాను. మాలాంటి ఉద్యోగాలను చూపించే ఒక కాంట్రాక్టు సంస్థ ఒకటి వుంది. ఆ సంస్థ మాలాంటి జంతువులను దుకాణాలకు, షాపింగ్ మాల్స్ కు, ధనవంతుల పిల్లల పుట్టినరోజులకు, ఎక్కడైనా కొత్త షాప్స్ ప్రారంభానికి , మేళాలకి పంపుతూ ఉంటుంది. ఆ సంస్థ మాకు ఉద్యోగం చూపించినందుకు, షాపుల వారు మాకు ఇచ్చే జీతం లో నుండి కొంత భాగం తీసేసుకుంటుంది .

మా లాంటి జంతువులందరికీ ఒక మృగ రాజు లాంటి ఆ సంస్థ కు చెందిన అధికారి ఒకడు ఉంటాడు. అతడే మాకు వేషం కి తగిన డ్రెస్సులు ఇచ్చి ,ఏ షాప్ దగ్గర ఉండాలో చెప్తాడు.

మాకు పండగ , పెళ్లిళ్ళ సీజన్లలో గిరాకీ ఎక్కువ ఉంటుంది . షాప్ తెరిచిన మొదలు , మూసేసే వరకు వచ్చే పోయే పిల్లలకు ,పెద్దలకు కరచాలనం చేస్తూ గెంతుతూ ,ఆడుతూ ఉండాలి . మమ్మల్ని చూసి సరదా పడే పిల్లలు కొంతమంది , భయపడే చిన్న పిల్లలు కొంతమంది ఉం టారు. కొంత మంది సెల్ఫీ లు కూడా తీసుకుంటుంటారు.

అందరికీ ఆనందాన్ని పంచే ఆ వేషం మాత్రం మాకు చాలా బాధా కరం గా ఉంటుంది. ఉన్ని తో చాలా మందంగా తయారు చేసిన ఆ డ్రెస్ వల్ల శరీరం కి గాలి తగలక , శరీరం అంతా దురదగా ,మంటగా ఉంటుంది. తల మించి వేసుకొన్న డ్రెస్ లో మా కళ్ళు తప్ప ఇంకేమి బయటకి కనపడకూడదు. దాని వల్ల సరిఅయిన శ్వాస కూడా అందదు.


వేసవి కాలం లో అయితే మా బాధ వర్ణనాతీతం. వేషం తీసేసి కొంత సేపు కూర్చుందామంటే , షాప్ యజమాని ఆగ్రహానికి గురి కావలసి ఉంటుంది. " మిమ్మల్ని బోల్డంత డబ్బు పెట్టి తెప్పించింది కూర్చోడానికి కాదు. అసలే షాప్ అమ్మకాలు అంతంత మాత్రమే ఉన్నాయి. వెళ్ళండి.వెళ్ళి అందరినీ ఆకర్షించండి " అని తిడుతూ ఉంటారు.

నోరు లేని ఆ మూగ జీవాల్లాగే, మేము కూడా నోరు లేని మనుషులమై పని చేస్తూఉంటాము. అమ్మే బట్టల్లో , సరుకుల్లో నాణ్యత ఉండాలి కానీ , అందరినీ ఆకర్షించి కొనిపిస్తే ఏం లాభం ఉంటుంది చెప్పండి? ఒక విధం గా ఇలాంటి షాపుల వల్ల మా లాంటి వారికి ఉపాధి దొరుకుతోంది.

నా వేషాన్ని చూసి ఆనంద పడే, నవ్వే జనాలని చూసి ఒకొక్కక్కసారి 'చదువుకొని ఈ వేషాలేంటని'? నన్ను చూసి నవ్వు

తున్నారని మనసు లో బాధ కలుగుతూ ఉంటుంది. ‘నా వేషం చూసి నవ్వుతున్నారులే’ అని నా మనసు కు సర్ది చెప్పుకుంటూ ఉంటాను.

మనసు లో ఎంత బాధ ఉన్నా, నా చదువుకు తగిన మరొక ఉద్యోగం ఎప్పుడికైనా దొరుకుతుందనే ఆశ తో, నన్ను చూసి ఆనంద పడే పిల్లల నవ్వులో నా కష్టాలన్నీ మరచిపోతుంటాను. ఇదండీ నా కథ .




మనిషి తను సమాజానికి బయపడుతున్నట్లు పైకి కనిపించినా తనకు నచ్చిన పనే తాను చేస్తాడు. తనకిష్టమైన నిర్ణయం తీసుకుంటాడు దానిని సమాజం ఒప్పుకునేలా లౌక్యంగా రంగులు పులుముతాడు. కొందరు స్వార్థం కోసం... మరికొందరు తమవారి క్షేమం కోసం...

*****************************

సంతోషంగా గడిచిపోతున్న మా జీవితంలో జరిగిన ఆ సంఘటన ఒక సునామీ అలలా వచ్చి మా ఆనందాన్ని లాక్కొని వెళ్లిపోయింది. పట్టణ శివార్లకు దగ్గరగా ఉండే పల్లెటూరు మాది.

అమ్మానాన్నా..ముందుచూపుతో తక్కువ ధరకు కొన్న స్థలాలు ఇప్పుడు కోట్లరూపాయల స్థిరాస్తిగా మారిపోయాయి.

నన్నూ తమ్ముడినీ చాలా అపురూపంగా కష్టం అనేది దరిదాపుల్లో కనపడకుండా పెంచారు అమ్మానాన్నా...

నేను ఇంజనీరింగ్ పూర్తిచేసి అమ్మకోరినట్లు మేనమామ కూతురు "ప్రభ" ను పెళ్ళి చేసుకున్నాను.

మంచికంపెనీలో.. పెద్దజీతంతో మంచి ఉద్యోగం నన్ను వెతుక్కుంటూ వచ్చింది. రెండో సంవత్సరంలో మా పాప నవ్వులు మా ఇంటవిరబూసాయి.

మా పాప భావన ఇప్పుడు ఐదోతరగతి చదువుతోంది.

మా తమ్ముడు రూపేష్ ఇంజనీరింగ్ చదివేరోజుల్లోనే తన క్లాస్ మేట్ జాస్మిన్ ను ప్రేమించి ఇంకా ఆఖరి సంవత్సరం పరీక్షలు అవకముందే మతాంతర వివాహం చేసుకొని నేరుగా ఇంటికి తీసుకొచ్చాడు.

జాస్మిన్ వాళ్లింట్లో తనకు పెళ్లినిశ్చయం చేయడంతో విధిలేక ఇలా చేయాల్సి వచ్చింది అని చెప్పాడు.

తమ్ముడి పెళ్లి గురించి ఎన్నో ఆశలు పెట్టుకున్న అమ్మ ,వాడు చేసిన పనిని సమర్థించలేక అటు కన్నకొడుకుని దూరం చేసుకోలేక కుమిలిపోయింది.

తరువాత నాన్నా,నేనూ అమ్మకు సర్దిచెప్పడానికి చాలా రోజులు పట్టింది.

లోకంతోపాటు కాలంతోపాటు మారకతప్పదని అర్థం అయ్యాక కాస్త సర్దుబాటు చేసుకుంది.

మనసుని కుదుటపరుచుకుంది.

కాని జాస్మిన్ వాళ్ల తల్లిదండ్రులు..

అసలు మాకు కూతురే పుట్టలేదు అనుకుంటాము ఇక జన్మలో మా ఇంటి గడప తొక్కవద్దని తేగేసి చెప్పారు.

"హరీష్....చిన్నోడు ఇలా చేసాడెందుకు "అని సంవత్సరం దాకా సణుగుతూనే ఉండేది అమ్మ.

ఇంతలో జాస్మిన్ నిండుజాబిల్లి లాంటి మగబిడ్డకి జన్మనివ్వడంతో..

అమ్మ అసంతృప్తి కాస్త తగ్గి, మనవడిని ముద్దులాడేనెపంతో వారికి కాస్త దగ్గరయ్యింది.

ఒకరోజు రూపేష్,తన స్నేహితుడు రాజాతో మోటార్ సైకిల్ పై పట్టణం వెళ్లి తన పరీక్షలకు ఫీజుకట్టి వస్తుంటే

బ్రేకులు ఫెయిల్ అయిన లారీ ఎదురుగా వస్తున్న బస్సును తప్పించి వీరు వస్తున్న బైకును బలంగా ఢీకొట్టింది.

రూపేష్, రాజా తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మరణించారు.

ఇద్దరూ మిత్రులూ ఒకే ఊరు వారుకావడంతో ఊరు ఊరంతా శోక సముద్రంలో మునిగిపోయింది.స్థానిక ఎమ్మెల్యే, నలుగురు ప్రతిపక్ష నాయకులు వచ్చి, మీడియా ముందు ఇదే సాకుగా ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకోవడం..పోటీలు పడి ఎక్స్ గ్రేషియా ప్రకటించి వెళ్లిపోయారు. మీడియా ఆ వార్తలోని తాజాదనం తగ్గేవరకూ మార్చిమార్చి చూపించి..

షాక్లో ఉన్న కుటుంబ సభ్యులనుంచి

ఏవేవో ఫైల్ ఫోటోలు తీసుకుని.. విషయాన్ని మూడొందల అరవై డిగ్రీల కోణాల్లో విశ్లేషించి.. విశదీకరించి హోరెత్తించాయి.

అమ్మను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

"రూపేషా..నా బిడ్డా..నన్ను అన్యాయం జేసి పోయినావు కదరా..

నా తండ్రి.. నీ భార్యా బిడ్డలతో నైనా ఒకసారి మాట్లాడురా..

దేవుడా ముసిలోళ్లను మమ్మల్ని మరిచిపోయావా..నా కొడుకును ఎందుకు పిల్చుకున్నావయ్యా..."

అంటూ గుండెలు బాదుకుంటూ ఏడుస్తుంటే..ఆ తల్లిరోదనను చూడలేక,ఆపే సాహసం చేయలేక అక్కడున్న ప్రతి గుండె కదిలిపోయింది.

********************

ఆ సంఘటన జరిగి మూడు సంవత్సరాలు గడిచిపోయినా ఆ గాయం చేసిన వేదన పచ్చిపుండులా మనసును తొలుస్తూనే ఉంది.

అమ్మా,నాన్న, జాస్మిన్.. ప్రాణమున్న శవాలుగా మాత్రమే మిగిలారు.

ఈ సమయంలో కూడా జాస్మిన్ వాళ్ల పుట్టింటి వాళ్లు కనీసం పలకరించడానికి కూడా రాలేదు.

వాళ్లు అంత కఠినంగా ఉండటం చాలా ఆశ్చర్యపరచింది.

********

ఆరోజు స్నానం చేసాక..పంచకట్టులో ..దేవుడి రూమ్ లోనికి వెళ్లి నాలుగు శ్లోకాలు జపించి అగరవత్తులు వెలిగిస్తుంటే...పక్కనే ఉన్న వంటిట్లో నుంచి అమ్మా, నా భార్య ప్రభ గుసగుసగా మాట్లాడుకోవడం నా చెవిలో పడింది.

"అత్తా ,మనకెందుకు ఈ తలనొప్పి.. వాళ్ల అమ్మగారింటికి పంపించెయ్యండి .జీవితాంతం వీళ్ల మంచి చెడ్డలూ చూడటం మా వల్లకాదు" అని ప్రభ కోపంగా అంటోంది.

"ఉష్..చిన్నగా.. ఎవరైనా వింటారు.

ఇప్పుడు నీకొచ్చిన కష్టం ఏమిటి.. జీతం లేని పనిమనిషిలా ఉంది కదా.

నీ పెత్తనానికి ఏమి అడ్డం వచ్చింది.

ఇంకా ఇన్సూరెన్స్ కోర్టులోనే ఉంది.

అది వచ్చేస్తే..ఆ నాలుగు రూపాయలు దాని చేతిలో పెట్టి పంపవచ్చు.

ఇప్పుడు అయితే.. మన ఆస్థిలో భాగం పంచాలి.

కొన్ని రోజులు ఓపిక పడితే..ఆస్థి మొత్తం మన "భావన"కే వస్తుందే పిచ్చిమొద్దు.

అంతవరకూ లోకం దృష్టిలో మనకు ఎంతో మంచిపేరుకూడా వస్తుంది.

నువ్వు అనవసరమైన ఆలోచనలు కట్టిపెట్టి..ముందు పనిచూడు.." అంటోంది అమ్మ.

రూపేష్ దూరమైనాక..

ఆ చేదు జ్ఞాపకాలు కాస్త మసకబారినాక

రూపేష్ కుటుంబం అమ్మకు ఇప్పుడు పరాయిదిగా అనిపిస్తోందా ఏమో..

దేవుడి రూమ్ లో గంటచప్పుడు వినగానే మాటలు ఆపేసారు.

దేవుడు రూమ్ లో గోడకు ఉన్న రూపేష్ ఫోటో ఎందుకో దిగులుగా కదిలింది.

***************************

కోర్టులో ఇన్సూరెన్స్ గురించిన కేసు కొలిక్కివచ్చి మరణించిన వారి రెండు కుటుంబాలకూ చెరొక ఇరవై లక్షల రూపాయలు మంజూరు చేసింది.

రాజా కుటుంబానికి కూడా ఆ విషయం చెప్పమని నాకే పురమాయించాడు లాయర్.

ఇక తప్పక వెళ్లాల్సివచ్చింది

వాళ్లిల్లు వెతుక్కుంటూ వెళ్లాను.

ఊరికి కాస్త దూరంలో ఉన్న కాలనీలో ఒక చిన్న మిద్దె ఇల్లు వాళ్లది.

కారు వీధి చివరలోనే పార్క్ చేసాను.

ఒక పది అడుగుల నడకకే సూర్యుడి ప్రతాపం తాలూకు వేడి చుర్రుమని తగులుతోంది.

గేటు తీసే ఉండటంతో

ఇంటిముందుకు వెళ్ళి తలుపు తడుదామనుకున్నాను.

లోపలనుంచి సన్నగా మాటలు వినపడుతున్నాయి.

రాజా తల్లి ఏడుపు గొంతుతో.. కోడలికి ఏదో చెబుతోంది.

"కమలా..నువ్వు నా కడుపున పుట్టిన బిడ్డ కాకున్నా నా కూతురు లాంటి దానివే. నా కొడుకుతో సంతోషంగా కాపురం చేసుకుంటూ పుట్టిన చిట్టితల్లితో హాయిగా గడుపుతుంటే విధికి కళ్లుకుట్టింది. రాజాని లాక్కొని పోయింది.

నిన్ను ఈ ఇంటికి పనిమనిషిని చేసింది.

పదిరోజుల క్రితం మా దూరపు బంధువు సుబ్బమ్మ పట్టణం నుంచి వచ్చినప్పుడు చెప్పలేక చెప్పినట్లు ఒక విషయం చెప్పింది.

వాళ్ల తమ్ముడు భార్య మాయదారి జ్వరం వచ్చి      చనిపోయి సంవత్సరం అయ్యింది కదా ..

నిన్ను వాళ్ల తమ్ముడికి ఇచ్చి పెళ్లిచేయమనింది.

నాకు కోపం వచ్చి నాలుగు తిట్టి బయటకు పొమ్మన్నా..

మళ్లా చాలా సేపు ఆలోచించాక ఆమె చెప్పింది సబబుగా తోచింది.

పసివయసులోనే తోడును కోల్పోయిన నీకు ఒకతోడు ఏర్పరచాలి అని అనిపించింది.

నీ పాపను కూడా వాళ్లు బాగా చూసుకుంటామన్నారు.

రాజా కూడా ఎక్కడున్నా.. మంచి పని చేసావమ్మా అంటాడు.

నువ్వు ఈలోకం ఏమంటుందా అని ఆలోచించకూ..

నువ్వు తప్పు పని చేయడం లేదు.

నీలాంటి పరిస్థితిలో ఉన్న ఇంకొకరి పరిస్థితిని అర్థం చేసుకొని ఒక కొత్త కుటుంబం ఏర్పరచుకుంటున్నావు.

ఇంట్లో వాళ్లకు కూడా నేను సర్దిచెబుతాను.

నువ్వు వేరే ఆలోచనలు ఏమీ పెట్టుకోకు.

కోర్టులో.. ఇన్సూరెన్స్ సొమ్ము ఈరోజు కాకున్నా రేపైనా వస్తుంది.

రాకున్నా కూడా పోనీ..మన ఆస్థిలో నీ భాగం ఎప్పటికీ నీదే.

మనవరాలిపైన ఫిక్స్ డిపాజిట్ వేసేద్దాం.

తన చదువుకూ..పెళ్లికి ఇబ్బంది రాకుండా…".అని అంటోంది.

రాజా భార్య.." అత్తా..ఇన్నిరోజులూ దేవుడు నాకు అన్యాయం చేసాడనుకున్నాను.నా గురించి ఇంతగా ఆలోచించే అత్తమ్మను దేవతలా అందించాడు " అంటూ కాళ్లపైన వాలిపోయింది.

వాళ్ల అనుబంధాన్ని అర్థం చేసుకొని నా కళ్లలో నీళ్లుచిమ్మాయి.

వారి మాటలు నేను విన్నానని వారికి తెలియకుండా బయటకు వచ్చేసాను.

గేట్ బయటకు వచ్చి..గేటు చప్పుడుచేసి పిలిచాను.

బయటకు వచ్చిన రాజా వాళ్లమ్మకు ఇరవైలక్షలు ఇన్సూరెన్స్ వస్తుందన్న విషయం తెలియజేసాను.

"రాబాబూ లోపలికి కాస్త మజ్జిగ తాగి వెళ్లు" అని ఆదరంగా పిలిచింది.


"లేదమ్మా. ఇప్పుడు ఒక ముఖ్య మైన పని మీద వెళుతున్నాను.మా తమ్ముడి భార్య కి ఒక మంచి ఉద్యోగం చూడాలి.తను గౌరవం గా బ్రతికే ఏర్పాట్లు చేయాలి.ఇంకొకసారి తప్పకుండా వస్తాను."అని చెప్పి వచ్చేసాను.

ఇక మీదట జాస్మిన్ నాకు చెల్లెలు.తనకు ఒక మంచి భవిష్యత్తు ఏర్పాటు చేయడం నా ప్రథమ కర్తవ్యం.అని నిర్ణయించుకున్నాను.

రూపేష్ నవ్వు ముఖం కళ్ళముందు కదలాడింది.

ఇప్పుడు మండుటెండ కూడా చల్లగా అనిపిస్తోంది.

పగలే వెన్నెల కురుస్తోంది.



గది నిండా చీకట్లు ముసిరాయి.వారము నుండి ధరణి ఏడుస్తూనే ఉంది.స్వర్గం లాంటి గృహసీమ నరకాన్ని తలపిస్తుంది.తనను ఎవరు పట్టించుకోలేదనే బాధ కంటే వారు తీసుకున్న నిర్ణయం మనసును తీవ్రంగా కలిచివేసింది.

"అమ్మా"

పిలుపు విని ఉలిక్కిపడి చూసింది.గదిలో ఎవరు లేరు. ఆనంద వదనంతో ఉదరంపై అప్యాయతగా నిమిరింది.

"అమ్మా,

ఈ బాహ్యా ప్రపంచంలోనికి ఎప్పుడెప్పుడు వస్తానా అని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాను.నా రాకతో నీ జన్మ సార్థకమవుతుందని నీ ఆనందాన్ని బట్టి తెలుస్తూనే ఉంది. నీ ఒడిలో ఆడుకోవాలని,చందమామను చూస్తూ నీ చేతి గోరు ముద్దలు తినాలని,బామ్మ చెప్పిన కథలు వింటూ తాతయ్యతో గెంతులేయాలని,నాన్న వీపుపై గుర్రమాట ఆడాలని ఎన్నెన్నో ఆశలు మదిలో కలుగుతున్నాయి.

అప్పుడప్పుడు నువ్వు ముభావంగా కూర్చొని దిగులుగా ఆలోచిస్తుంటే నాకు భయంగా ఉందమ్మా,అది నా గురించే నని అర్థమవుతుంది. వారము క్రితం ఆసుపత్రి కెళ్ళివచ్చినప్పటి నుండి మన ఇంట్లో వాతావరణమే మారిపోయింది. ఆడపిల్ల వద్దని, ఆపరేషన్ చేయించుకొమ్మని నాన్న బలవంతం చేస్తున్నాడు కదమ్మా!తన మాట వినడం లేదని రోజూ మీ ఇద్దరి మధ్య జరుగుచున్న గొడవ చూస్తున్న నాకు ఏడుపొస్తుందమ్మా!

నేనేమి నేరం చేసానమ్మా, నన్ను చంపాలని చూస్తున్నారు. ఆడపిల్ల ఇంటికి కళ అంటారు కదా,మరి భ్రూణహత్యలు చేసి ఇల్లును స్మశానంగా మార్చే మనుషుల మధ్య నీలాంటి సాత్వికురాలు ఎలా బతకగలదమ్మా? నువ్వు ధైర్యంగా పోరాడు,నన్ను రానివ్వు, నే వచ్చిన తర్వాత నీ కన్నీళ్ళను తుడుస్తాను.ఆడపిల్లలు మగపిల్లల తో పోల్చిచూస్తే ఎందులోనూ తీసిపోరు.మొన్నటి ఒలంపిక్ క్రీడల్లో రెండు పతకాలు తెచ్చి మన దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసినది ఆడపిల్లలేనని మరిచారా?


ఈ మనుషులకు జన్మనివ్వడానికి తల్లి కావాలి పెళ్ళి చేసుకోవడానికి భార్య కావాలి కాని కూతురు ఎందుకు ఉండకూడదు? ఆడపిల్ల పుట్టినప్పటి నుండి చనిపోయేవరకు అనుక్షణం నరకయాతన అనుభవిస్తూనే ఉంది. కుటుంబం, సమాజం, రాజకీయం ఉద్యోగరంగాల్లో ప్రతి చోట ఏదో ఒక రకమైన వివక్షను ఎదుర్కొంటూ కూడ విజయాలు సాధించి స్త్రీల ఔన్నత్యాన్ని ప్రపంచానికి

పలుమార్లు చాటిచెప్పింది.

సాంకేతికతను నీచ ప్రయోగాలకు ఉపయోగించుకునే దుర్మార్గులున్న సమాజానికి రావడం ఇష్టం లేకున్నా,ఆడపిల్లలను చిన్న చూపు చూసే మూర్ఖులకు సరైన సమాధానం చెప్పడానికై రావాలనుకుంటున్నాను.ఆడది అబల కాదని, ప్రోత్సాహమిస్తే ఏదైనా సాధించగలదు.బంధాలను మరిచి అనుబంధాలను అమ్ముకునే కుసంస్కృతిని రూపుమాపడానికి నేను వస్తున్నాను.

వీలైతే నాన్నకు నచ్చచెప్పి చూడు,విననిచో ఎదురు తిరుగు.పసి బిడ్డ ను చంపే హక్కు ఎవరికి లేదు.నీ కంఠంలో ఊపిరున్నంత వరకు నా రాకకై పోరాడు.ఎలాగైనా నన్ను ఈ ప్రపంచంలోకి ఆహ్వానించమ్మా! “

ధరణి కన్నీళ్ళు తుడుచుకుంటూ ఆత్మవిశ్వాసం తో అడుగులు ముందుకు వేసింది. గదినిండా కోటి దీప కాంతులు వెలిగాయి.




ఓ ఆడపిల్ల పెళ్లి పందిట్లో ఆగిపోతే అంతా ఏమనుకుంటారు.అపుడు ఎమౌతుంది లాంటివి సినిమాల్లోనూ ,సీరియల్స్ లోనూ చూడటమే తప్ప,నిజంగా ఏం జరుగుతుందో నాకూ తెలీదు.కానీ అలాంటి సంఘటన ఇప్పుడు నా జీవితంలోనూ జరిగింది.మాకు మీ సంబంధం వద్దు,మీ అమ్మాయిని అనుకోగానే మా వ్యాపారం పూర్తిగా దెబ్బతింది.మా నాన్నగారు పోయారు.ఇప్పుడు ఈ

పచ్చని పందిట్లో మా అమ్మకి గుండెపోటు వచ్చింది.కనుక ఇక్కడితో ఆపేద్దాం.అని వారు వెళ్లిపోయారు.అమ్మ కన్నీటి ధారగా ఏడుస్తోంది.అన్నయ కూడా చాలా బాధపడిపోయాడు.

కానీ అంతా ఆ తరువాతి అరగంటలో తలక్రిందులైపోయింది.మా అన్నయ్య స్నేహితుడు శేఖర్ ,అన్నయ్యని ఒప్పించి,అదే ముహుర్తానికి నా మెడలో తాళి కట్టాడు.చాలా సంతోషం అనిపించింది.అమ్మ కన్నీరు ఆనందబాష్పాలుగా మారాయి.అన్నయ్య కూడా స్తిమిత పడ్డాడు. ప్రస్తుతం పక్కన పెడితే, పెళ్లి ఆగినపుడు నేను బాగా కృంగిపోయాను.అంతా శూన్యంగా తోచింది.అంత వెలుగులోనూ నా కళ్ళకి చీకటి పొర కమ్మింది. మరుక్షణంలో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను.కానీ,మా నాన్న చెప్పిన మాటలు,అవును మా నాన్న చెప్పిన మాటలే నాకు మరీ, మరీ, గుర్తుకు వచ్చాయి.

ఆయనెప్పుడూ, ఏది జరిగినా అది మన మంచికే అనేవారు.నాకు పెన్ను కొన్నా,పుస్తకం కొన్నా ఆ వాక్యమే రాయించేవారు.ఆయన పోయాక కూడా అలా పుస్తకాల్లో రాసుకోవడం నాకు అలవాటుగా మారింది.అది అలా నా మనసులో నాటుకుపోయింది.ఇప్పుడు కూడా అదే నమ్మి ధైర్యంగా నిలబడ్డాను. అంతా కుదుట పడింది.కానీ ఇంకా నాలో ఎన్నో సందేహాలు మాత్రం ఉన్నాయి. శేఖర్ నన్ను పెళ్లి చేసుకున్నాడు.కానీ త్యాగం చేశాడు కనుక,రేపు తనకి నేను ఋణపడి ఉండాలంటాడా?ఏమో.నేను ఎప్పుడూ నన్ను నన్నుగా ఇష్టపడి పెళ్లాడే వాడే కావాలనుకున్నాను.కానీ స్నేహితుడి పరువు బరువు తగ్గకూడదనే శేఖర్ నన్ను పెళ్లాడాడా.ఏమో.కానీ ఏం జరిగినా ముందడుగే వేస్తాను.

ఎందుకంటే ,నాన్న అన్నట్టు ఏది జరిగినా మన మంచికే. అని ఆమె ఆలొచిస్తుండగానే,బస్సు పెద్ద బ్రేకుతో ఆగడంతో,ఆలోచనల్లోంచి బయటకు వచ్చింది లలిత.తన పక్కనే ఉన్న శేఖరాన్ని చూసింది.సెల్ ఫోన్ చూస్తున్నాడు.లలిత చూడటం గమనించి,ఏంటి లలితా ఇది మరీ కాకపోతే, పెళ్ళయిన వెంటనే అన్నవరంలో వ్రతం చేయించాలా.ఎంటో మీ అన్నయ్య. నీకు బడలికగా ఏమైనా ఉందా.అడిగాడు.

అబ్బే లేదండీ.అయామ్ ఓకే .

లలిత చేయి తన చేతిలోకి తీసుకుంటూ,లలితా, నేను నిన్ను జాలిపడో, మీ అన్నయ్య నాకు  గత అయిదేళ్లుగా స్నేహితుడు కనుకనో పెళ్లి చేసుకున్నానని ఎప్పుడూ అనుకోవద్దు.కాకపోతే ఇక్కడ నేను నీకు నచ్చానా లేదా,నీ అభిప్రాయం ఏంటి అని అడక్కుండా మేమే నిర్ణయాలు తీసుకున్నాం.అదే నాకు కొంచెం మింగుడు పడలేదు.కానీ ఆ సంధర్భం అటువంటిది.చెప్పాడు.

లలిత ముఖం కొంచెం విప్పారింది.హమ్మయ్య.త్యాగం చేశాను.అదీ ఇదీ అని మబ్బుల్లో ఉంటాడనుకున్నాను. కాదు. మంచి మనిషే. కానీ అన్నవరం వ్రతం తర్వాత, నన్ను నేరుగా వారి తల్లిదండ్రులకి పరిచయం చేస్తానంటున్నాడు.అదే కొంచెం భయంగా

ఉంది.వారేమంటారో ఏమో.కట్నం లేదు.గిట్నం లేదు.లాంచనాలు లేవు.వీడే వెళ్ళి పెళ్లి చేసుకు వచ్చాడు.తల్లిదండ్రుల అనుమతి అక్కర్లేదా.మేం చచ్చావనుకున్నావా అని ఏం గొడవ చేస్తారో ఏమో. అనుకుంది మనసులో.

లలితా, ఏం ఆలోచిస్తున్నావ్.పెళ్లి ఇలా నాతో జరగడం.?అంటూ ఆపాడు.

అబ్బే అదేం లేదు.ఏదో పరధ్యానం.అయినా మీరు కొత్త వ్యక్తి కాదు కదా.మిమ్మల్ని గత అయిదేళ్లుగా ఎరుగుదును .అలాగే మీ గురించి అన్నయ్య మంచిగా చెప్పడం చాలా సార్లు విన్నాను.కనుక అమ్మ,అన్నయ్యల నిర్ణయం పై నాకు నమ్మకం ఉంది. చెప్పింది లలిత సర్దిచెబుతూ.

నీ నోటి నుండి ఈ మాట విన్నాక నాకు చాలా తేలికగా అనిపిస్తోందిపుడు.అలాగే నిన్ను పెళ్లి చేసుకున్న వేళా విశేషం, సేలరీ హైక్ ఈ నెల నుండి కలుస్తుందని ఇప్పుడే మెసేజ్ వచ్చింది. అని మళ్ళీ తన ఫోన్ లో మునిగిపోయాడు శేఖరం.

తర్వాత వ్రతం ముగించుకుని ,శేఖర్ లలితతో కలిసి తన ఇల్లు చేరాడు.లలిత గుండె ధడ,ధడలాడింది.

పనిమనిషి వచ్చి ఇద్దరికీ ఎర్ర నీళ్ళతో దిష్టి తీసి ,హారతిచ్చింది.ఇద్దరూ లోపలికి వెళ్లారు.తర్వాత శేఖర్ తండ్రి మూర్తి గారు ,తన భార్యతో కలిసి బెడ్రూం లోంచి హాల్లోకి వస్తూ ,ఇద్దరినీ చూసి ,అరె ?వాటే సర్ప్రైస్.మాకు పూర్తిగా శ్రమ తగ్గించేసారే.కానీ మొత్తానికి అనుకున్నది సాధించావ్.ప్రేమించిన అమ్మాయినే పెళ్లాడావ్.అని లలిత వంక చూస్తూ,వీడికి నువ్వంటే చాలా ఇష్టమమ్మా. మీ అన్నయ్య వంకెట్టుకుని మీ ఇంటికి ఒకటికి రెండు సార్లు వచ్చేవాడు.కానీ గడిచిన అయిదేళ్లలో నీకు వాడి ప్రేమ విషయం చెప్పే ధైర్యం మాత్రం చేయలేకపోయాడు.ఇక మీ అన్నయ్యకి కోపం జాస్తి కదా.ఈ విషయం అడిగితే, నా స్నేహం అడ్డు పెట్టుకుని నా చెల్లెలిపై కన్నేస్తావా అని అంటాడేమో అని భయపడి,మాతో గౌరవంగా అడిగించాలనుకున్నాడు.

అయితే ఉద్యోగం సద్యోగం లేకుండా పిల్లనిమ్మని ఏం అడుగుతాం.కనుక ముందు జాబ్ తెచ్చుకుంటాను.అని మమ్మల్ని ఆపేశాడు. అన్నట్టుగానే మంచి సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ సంపాదించాడు.దాని ట్రైనింగ్ కోసం రెండు నెలలు ఢిల్లీ వెళ్ళాడు.ఈలోపు నీ నిశ్చిత్తార్థం జరిగి,పెళ్లి ముహూర్తాలు పెట్టుకుని ,శుభలేఖలు వేశాక మీ అన్నయ్య వీడికి విషయం ఫోన్ లో చెప్పాడు.అంతే.వీడు మూడు రోజులు అన్నం తినలేదు.తర్వాత మేం చెప్పగా చెప్పగా తేరుకున్నాడు.మీ అన్నయ్య కూడా ఒకటికి పది సార్లు వీడిని నీ పెళ్ళికి రావాలని పిలవడంతో, తప్పక,అయిష్టంగానే నీ పెళ్ళికి వచ్చాడు.ఆఖరికి వీడి మొర భగవంతుడు ఆలకించాడు.నిన్ను వీడికి దగ్గర చేశాడు.చాలా సంతోషం.ఇంతకీ వీడు మీ అన్నయ్యకి ఏం చెప్పి ఒప్పించాడు.ఆ పెళ్లిని ఎలా తప్పించాడు.అడిగాడాయన ఆశక్తిగా.

ఆ మాటకి లలితా,శేఖర్లిద్దరూ ఒకేసారి గట్టిగా నవ్వేశారు.

విషయం అర్ధం కానీ మూర్తిగారు,ఇద్దరి వంకా చిత్రంగా చూస్తుండిపోయారు.

ఇప్పుడు లలిత మనసు పూర్తిగా తేలిక పడింది.అన్ని సందేహాలూ ముక్కలయ్యాయి.నేను అనుకున్నట్టే నన్ను నన్నుగా ఇష్టపడే శేఖర్ పెళ్లాడాడు.అవును,నాన్న చెప్పిందే నిజం.ఏది జరిగినా మన మంచికే.థాంక్స్ నాన్నా అనుకుందామె మనసులో.